




అమరావతికి అందలం.. సంక్షేమానికి జవసత్వాలు.. వివిధ పథకాలకు పూర్వ వైభవం.. పడకేసిన సాగునీటి ప్రాజెక్టులకు పునరుజ్జీవం.. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రతి రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం సోమవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతో పాటు ఆయా రంగాలపై బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇవ్వడంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరావతికి బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరగడంతో ఇక అభివృద్ధి పనులు పరుగులు తీయనున్నాయి. గత పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన సాగునీటి రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈ క్రమంలో కృష్ణా డెల్టా, పులిచింతలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. అదేవిధంగా భారీ వర్షాలతో తెగిపోయి రైతులను నిండా ముంచేస్తోన్న సాగునీటి కాల్వల బాగుకు కూడా నిధులు కేటాయింపులు జరిగాయి. ఇక విద్యా పరంగా స్కిల్ డెవలప్ మెంట్, విదేశీ విద్య కోసం గతంలో అమలు చేసిన అంబేడ్కర్ విదేశీ విద్యోన్నతి పథకం పునరుద్ధరణతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమరావతికి అందలం



రాష్ట్ర బడ్జెట్లో భారీగా కేటాయింపులు

- సంక్షేమానికి జవసత్వాలు.. పథకాలకు పూర్వవైభవం
- రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులకు రూ.4 వేల కోట్లకు పైగా
- మెట్రో రైలుకు రూ.50 కోట్లు, హైకోర్టు భవనాలకి రూ.13.3 కోట్లు
- కృష్ణా డెల్టాకు రూ.138.76 కోట్లు.. భూసేకరణకు మరో రూ.50 కోట్లు
- పులిచింతల నిర్వహణకు రూ.29.45 కోట్లు.. గుండ్లకమ్మకు రూ.13 కోట్లు కేటాయింపు



సేతు బంధన్ కింద రూ.115.2 కోట్లు

కేంద్ర ప్రభుత్వ పథకమైన సేతబంధన్ కింద చేపట్టబోతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.115.2 కోట్లను చూపించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో ఆర్‌వోబీలు మంజూరైనప్పటికీ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరులోని శంకర్‌విలాస్ ఆర్‌వోబీ విస్తరణకు వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర బడ్జెట్‌లో సేతుబంధన్ కింద కేటాయించిన రూ.115.2 కోట్లలో సింహభాగం నిధులు శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

గుంటూరు, బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా పడకేసిన రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు నిర్వీర్యమైన వివిధ రంగాలు, ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రత్యేకంగా దృష్టి సారించింది. సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ఆయా అంశాలకు ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం మరో నాలుగు నెలల 20 రోజుల్లో ముగియనున్న దృష్ట్యా ఆ మేరకు ఆశాజనకంగానే కేటాయింపులు చేసింది. ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ప్రతి రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై బడ్జెట్లో ప్రస్తావనకు కూడా నోచుకోని అమరావతికి కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్లో అత్యంత ప్రాధాన్య అంశంగా కనిపించింది. రాజధాని నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. అమరావతి క్యాపిటల్ డెవలప్మెంట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకంగా రూ.3 వేల కోట్లు కేటాయించింది. స్మార్ట్ సిటీల కార్యక్రమంలో భాగంగా అమరావతికి వేర్వేరుగా నిధుల కేటాయింపు జరిగింది. ఇందులో సీఐటీఐఐఎస్ చాలెంజ్ ప్రోగ్రామ్ కింద రూ.32 కోట్లు, మిషన్ డెవలప్‌మెంట్ స్మార్ట్‌సిటీలో అమరావతికి రూ.50 కోట్లు కేటాయించారు. ఏపీసీఆర్‌డీఏ సహాయ నిధి కింద బడ్జెట్‌లో రూ.1053.70 కోట్లు కేటాయించారు. ల్యాండ్ పూలింగ్ ఫర్ కేపిటల్ సిటీ కోసం రూ.400 కోట్లు కేటాయించారు. నవ్యాంధ్ర రాజధానిగా అమరావతిని నిర్ణయించిననాటి నుంచి మెట్రో రైలు ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలను ఊరిస్తూనే ఉంది. 2014- 19ల మధ్య ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ ప్రాజెక్టు 2019- 24 మధ్య వైసీపీ హయాంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. తాజా బడ్జెట్లో మెట్రో రైలు విభాగానికి రూ.50 కోట్లు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం రాజధాని పట్ల తన చిత్తశుద్ధిని ప్రకటించింది. దీంతోపాటు హైకోర్టు భవనాల నిర్మాణాల కోసం రూ.13.3 కోట్లు, ఏపీ సైన్స్ సిటీ కోసం రూ.2.6 కోట్లు కేటాయించింది. అమరావతికి బడ్జెట్ కేటాయింపులు జరిగిన సోమవారం రోజే రాజధాని అమరావతి మరో మైలురాయిని అధిగమించింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి వస్తున్న నిధులకు సంబంధించి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులతో సీఆర్డీఏ కమిషనర్ సంతకాలతో రుణ ఒప్పందం పూర్తయి నిధులు మంజూరవనున్నాయి. ఇక మంగళగిరిలోని ఎయిమ్స్‌లో నీటి సరఫరా కోసం రూ.5 కోట్లు కేటాయించారు.

ఎన్జీ రంగా వర్సిటీకి.. రూ.507 కోట్లు


గుంటూరు సిటీ: గుంటూరు సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీకి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. వైసీపీ హయాంలో వర్సిటీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఇటీవల రంగా జయంతి కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు వర్సిటీకి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో రూ.507 కోట్లు కేటాయించారు. ఈ నిధుల కేటాయింపుతో వర్సిటీకి ప్రభుత్వం జీవం పోసినట్లైంది. భూసార పరీక్షలకు పెద్ద పీట వేయడంతో పాటు, రైతులకు అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ కృతనిశ్చయం ఈ నిధుల కేటాయింపుతో నెరవేరుతుందని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. రైతులకు యంత్ర పరికరాలు, క్రమం తప్పకుండా భూసార పరీక్షలు, ఉద్యాన పంటలకు రాయితీలు, ఆక్వాసాగుకు ప్రోత్సాహకాలకు కూటమి ప్రభుత్వం సముచిత ప్రాధాన్యం ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా యంత్ర పరికరాలకు దాదాపు రూ.11 కోట్లు, భూసార పరీక్షలకు రూ.3 కోట్ల వరకు కేటాయింపు ఉండొచ్చని తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌కు రూ.2.50 కోట్లు, ఉద్యాన పంటల రాయితీల కింద రూ.300 కోట్ల వరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. వడ్డీలేని రుణాలలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాటా రూ.45 కోట్ల వరకు , రైతు సేవా కేంద్రాలకు సంబంధించి రూ.3 కోట్ల వరకు నిధుల కేటాయింపు దక్కే అవకాశం ఉంది.



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ

సాగునీటి ప్రాజెక్టులకు పునరుజ్జీవం

పడకేసిన సాగునీటి ప్రాజెక్టుల పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం భారీగా నిధుల కేటాయించింది. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కృష్ణా పశ్చిమ డెల్టా కింద 5.50 లక్షల ఎకరాలు సాగవుతుండగా రూ.138.76 కోట్లు కేటాయించారు. డెల్టా కింద



భూసేకరణ కోసం రూ.50 కోట్లను కేటాయించారు. ఇది గుంటూరు చానల్ పొడిగింపు ప్రాజెక్టు కోసమా.. గోదావరి - పెన్నా నదుల అనుసంధానం కోసమా అనేది తేలాల్సి ఉన్నది. డెల్టాలో పెండింగ్‌లో ఉన్న ఆధునికీకరణ పనుల పూర్తిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూ.37.53 కోట్లను కేటాయించింది. దీంతో ఆయా పనులు పూర్తి అవుతాయని అధికారవర్గాలు తెలిపాయి. పులిచింతల ప్రాజెక్టు నిర్వహణని కూడా గత ప్రభుత్వం మరిచింది. దాంతో ఒక దఫా భారీ వరద వచ్చినప్పుడు రేడియల్ క్రెస్టు గేటు కొట్టుకుపోయింది. దాని స్థానంలో స్టాప్‌లాక్ గేటు అమర్చేందుకు జలాశయంలోని నీటిని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఖాళీ చేయించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పులిచింతల ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.29.45 కోట్లను కేటాయించింది. దీని వలన నిర్వహణ పనులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవు. గత ప్రభుత్వ వైఫల్యంతో ఏకంగా గేట్లే కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.13 కోట్ల నిధుల కేటాయింపు జరిగింది. ప్రాజెక్టు ప్రకాశం జిల్లాలో పరిధిలో ఉన్నా బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గ ప్రజలకు సాగునీటి విషయంలో గుండ్లకమ్మ దోహదపడుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో కాల్వలు, వాగుల గట్లు తెగిపోయి పంటలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరద నియంత్రణ ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో రూ.19.55 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది.

ఎన్టీఆర్‌కు నివాళి..



అసెంబ్లీ ఆనవాయితీ ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు సోమవారం అసెంబ్లీ సమావేశాలకు వెళ్తూ వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన వెంట మంత్రులు నారాయణ, లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు విశాఖ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఉన్నారు. -తుళ్లూరు

గోతుల్లేని రోడ్ల కోసం..



గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో రోడ్ల మరమ్మతుల కోసం దాదాపు వెయ్యి కోట్ల వరకు అవసరమవుతుందనే అంచనాలను రూపొందించారు. ప్రభుత్వం తాజాగా జరిపిన కేటాయింపుల్లో భాగంగా జిల్లాలకు ఇతోధికంగానే వాటా దక్కనున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కింద రూ.800 కోట్లు, ఆర్‌అండ్‌బీ కింద వెయ్యి కోట్ల వరకు నిధులు మూడు జిల్లాల పరిధిలో దక్కనున్నాయి.

సంక్షేమం.. నైపుణ్యం



నామినేటెడ్ పదవుల కోసమే అన్నట్లుగా వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటిని కుదేలు చేసిన ఘనత గత ప్రభుత్వానిది కాగా కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లు ఆయా వర్గాల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ఇతోధికంగా నిధులు కేటాయించింది. ఎస్సీ సంక్షేమం కింద దాదాపు రూ.600 కోట్లు, ఎస్టీ వెల్ఫేర్ కింద రూ.200 కోట్లు, బీసీ సంక్షేమం కింద దాదాపుగా రెండు వేల కోట్లవరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. నైపుణ్యాభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల కేటాయించగా ఈ నిధుల వ్యయంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలకు అంకురార్పణ జరిగే అవకాశాలున్నాయి

గంజాయి మత్తులో విద్యార్థులు

- 25 మంది సభ్యుల ముఠా అరెస్టు
- 7.2 కిలోల గంజాయి స్వాధీనం

8

ముగిసిన బేస్‌బాల్ పోటీలు

◆ గుంటూరు బాలికల జట్టుకు ప్రథమస్థానం

వైన్ షాప్‌పై.. టీడీపీలో వైరం

- లైసెన్స్‌దారుడు ఎంచుకున్న స్థలం నుంచి మార్చాలని ఓ మంత్రి హుకుం.. 6

సచివాలయాల్లో సమయపాలన పాటించాలి

ఉద్యోగులపై పర్యవేక్షణ ఉండాలన్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల స్థాయి అధికారులతో సోమవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విధులకు హాజరుకాని ఉద్యోగులపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. కరెక్షన్ల కోసం పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఆధార్ కేంద్రాలు సక్రమంగా నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువమంది విద్యార్థులు ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి అపార్ ఐడీలను నమోదు చేయించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాద్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ బ్రహ్మయ్య, సీపీవో శేషశ్రీ, డీఈవో రేణుక, డీపీవో సాయి కుమార్, డ్వామా పీడీ శంకర్, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, భూగర్భజలవనరులశాఖ డీడీ వందనం, మార్కెట్ శాఖ ఏడీ రాజాబాబు పాల్గొన్నారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

8

శివోహం

- ▸▸ శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- ▸▸ భక్తజన సంద్రంగా అమరావతి అమరేశ్వరాలయం
- ▸▸ కోటప్పకొండలో భక్తుల కోలాహలం
- ▸▸ కాకాని మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి



పెదకాకానిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్న భక్తులు, పర్యాటకుల



అమరావతిలోని అమరేశ్వరస్వామి మూలవిరాట్

పార్టీ అండగా ఉంటుంది : ఎమ్మెల్యే ఆనందబాబు



గుంటూరులో చికిత్స పొందుతున్న రాజేంద్రప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లిపర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తూమాటి రాజేంద్రప్రసాద్‌ను ఇసుక రీచ్‌లో వైసీపీ నాయకులు ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. అతనిని ఆదివారం రాత్రి మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేంద్రప్రసాద్‌ను సోమవారం హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆళ్ల సురేష్‌రెడ్డి, జి. పొలెష్ తదితరులు ఉన్నారు.

పడవ, బల్లకట్టు రేవులకు నేడు బహిరంగ వేలం

గుంటూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పడవ, బల్లకట్టు రేవులకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా పరిషత్‌లోని డిప్యూటీ సీఈవో కార్యాలయంలో సీల్డ్ టెండర్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. అచ్చంపేట మండలంలోని చామర్రు - కాసరబాద (కృష్ణా జిల్లా), చింతపల్లి-ఈస్తేపల్లి (కృష్ణాజిల్లా), గింజుపల్లి-వేదాద్రి (కృష్ణా జిల్లా), తాడువాయి-రామన్నపేట (కృష్ణా జిల్లా), మాదిపాడు-ముక్త్యాల (కృష్ణా జిల్లా), మాదిపాడు-బుగ్గ మాదరం (సూర్యాపేట జిల్లా), మాచవరం మండలం గోవిందాపురం-చింతిర్యాల (సూర్యాపేట జిల్లా), అమరావతి మండలం దిడుగు- ఏటూరు (కృష్ణా జిల్లా), ధరణికోట-కునికినపాడు (కృష్ణా జిల్లా), కొల్లిపర మండలంలోని వల్లభాపురం- వల్లూరుపాలెం (కృష్ణా జిల్లా) రేవులకు వేలం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

15న రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు

గుంటూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాలలో ఈనెల 15న కళాశాల మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.గోపిచంద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తు కోసం అమ్మాయి దృష్టి (గర్ల్స్ విజన్ ఫర్ ది ఫ్యూచర్)అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. రిజిస్ట్రేషన్ రుసుం, ఐడీ కార్డు, ప్రిన్సిపల్ అధికారిక లేఖతో రావాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ. 2 వేలు అందిజేస్తామని తెలిపారు.

14న కౌముది కిరణాలు పుస్తకావిష్కరణ

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న భారతీ విద్యాభవన్‌లో కౌముది కిరణాలు అనే పుస్తకావిష్కరణ జరుగుతుందని సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. కిరణ్ ప్రభ, కాంతికిరణ్‌లతో ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. 14న సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకానికి కిరణ్ ప్రభ పేరు చిరపరిచితమేనన్నారు. నాలుగు దశాబ్దాల కిందటే 'ఫోటో కవిత' అనే సరికొత్త సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు.

వైన్ షాప్‌పై.. టీడీపీలో వైరం!

- లైసెన్స్‌దారుడు ఎంచుకున్న స్థలం నుంచి మార్చాలని ఓ మంత్రి హుకుం..
- అక్కడ పెడితే అతని మిత్రుని బార్‌కి ఇబ్బందట!
- పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు
- రంగంలోకి సీనియర్ టీడీపీ ఎమ్మెల్యేలు
- ఆ షాపును కదిలిస్తే ఊరుకోమని వార్నింగ్

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వైన్ షాపుల విషయంలో జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి మాత్రం ఆ వార్నింగ్‌లు తనకు వర్తించవన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. లాటరీలో షాపును దక్కించుకున్న ఓ మద్యం వ్యాపారి గుంటూరు నగరంలోని లక్ష్మీపురం ప్రాంతంలో ఓ షాపును లీజుకు తీసుకొని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ప్రస్తుతం టెంపరరీ లైసెన్స్‌తో ఆ షాపు నడుస్తుంది. ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఆ షాపు ఉన్నప్పటికీ ఇంతవరకు పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకుండా ఎక్సైజ్ అధికారులు కాలయాపన చేస్తున్నారు. కొద్ది రోజులుగా కార్యాలయం చుట్టూ ఆ వ్యాపారి తిరుగుతున్నా పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకపోగా, అతనికి ఓ ఉచిత సలహా ఇచ్చారు. అక్కడ కాకుండా ఇంకొంచెం దూరంలో షాపు చూసుకొని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన షాపులో సర్వ హంగులు ఏర్పాటు చేసినందుకు రూ. లక్షల్లో ఖర్చు పెట్టిన ఆ వ్యాపారి నిర్ఘాతపోయాడు. ఎందుకు మార్చమంటున్నారని ఆరా తీయగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి ఆ షాపును అక్కడ నుంచి మార్పించాలని హుకుం జారీ చేసినట్లు ఆ షాపు యజమానికి తెలిసింది. దీనికి కారణం ఆ షాపునకు కొద్ది దూరంలో మంత్రిగారి మిత్రుడికి బార్ ఉండటమే. అక్కడ బ్రాందీ షాపు ఏర్పాటు చేయటం మూలంగా ఈ కొద్ది రోజుల్లోనే తన మిత్రుడి బార్‌కు వ్యాపారం తగ్గిపోవటంతో సదరు మంత్రిగారికి కోపం వచ్చిందట. మిత్రుడి కోసం ఆ మంత్రి బ్రాందీ షాపును అక్కడ నుంచి మార్చాల్సిందేనని ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి తేవడం మూలంగా పర్మినెంట్ లైసెన్స్ మంజూరు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. మంత్రి జోక్యం చేసుకున్నారనే విషయం తెలుసుకున్న బ్రాందీ షాపు యజమాని తనకు పరిచయం ఉన్న టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి విషయాన్ని విన్నవించావాపోయినట్టు తెలిసింది. దీంతో పల్నాడు ప్రాంతానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఒకరు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ఆ షాపును అక్కడ నుంచి కదిలిస్తే ఊరుకోనని ఎక్సైజ్ అధికారులకు వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది. నిబంధనలకు అనుగుణంగా ఆ షాపు ఏర్పాటు చేసి ఉండకపోతే చెప్పండి తీసేపిస్తా, అంతేగానీ మంత్రి చెప్పాడనో, ఇంకొకరు చెప్పారనో మీరు తల ఊపి తప్పుడు పనులు చేస్తే ఊరుకోనని వార్నింగ్ ఇవ్వటంతో ఎక్సైజ్ అధికారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిగా మారింది. ఏదైతే అది అవుతుంది న్యాయం పక్షానే నిలుద్దామనే ఉద్దేశంతో మంత్రికి పరిస్థితి వివరించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి ఈ నెల 10వ తేదీతో పర్మినెంట్ లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ ముగిసిపోవాల్సి ఉంది. ఆదివారం రాత్రి ఆ బ్రాందీ షాపునకు పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వాలనే ప్రయత్నంలో ఉండగా ప్రభుత్వం ఈ నెల 15 వరకు గడువు పొడిగించింది. దీంతో ఆ షాపునకు లైసెన్స్ ఇచ్చే ప్రక్రియను మరో రెండు, మూడు రోజులకు వాయిదా వేశారు. ఈ లోగా మంత్రికి పరిస్థితిని వివరించాలని భావిస్తున్నారు.

25 షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు పెండింగ్

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మొత్తం 256 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతివ్వగా ఇందులో 231 షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు మంజూరు చేసేశారు. మరో 25 షాపులకు మాత్రం వేర్వేరు కారణాలతో ఇంకా పర్మినెంట్ లైసెన్స్‌లు ఇవ్వలేదు. గుంటూరు జిల్లాలో 11 షాపులకు లైసెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఒకటి లక్ష్మీపురం బ్రాందీ షాపు, మిగతా పది జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 14 షాపుల లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. కొద్ది రోజుల క్రితం మాత్రం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు తమ సంగతి ఏంటంటూ వాటాల కోసం, మామూళ్ల కోసం ఒత్తిడి చేయటంతో వారిని ఎలాగానో ఒప్పించుకొని ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని చోట్ల షాపులు దక్కించుకున్న వారు రాజకీయ ఒత్తిళ్ల తట్టుకోలేక వదిలేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న లైసెన్స్‌ల విషయంలో ఒకటి, రెండు చోట్ల మినహా మిగతా చోట్ల చెప్పుకోదగ్గ అభ్యంతరాలు లేవని అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారుల పక్కన ఉండకూడదనే నిబంధనకు విరుద్ధంగా టెంపరరీ షాపులు ఏర్పాటు చేసుకున్న వారు కొద్ది దూరం వెనక్కి వెళ్లి కొత్త షాపు ఏర్పాటు చేసుకోవటంలో జాప్యం మూలంగా పర్మినెంట్ లైసెన్స్ మంజూరు ప్రక్రియ ఆగిందని, త్వరలో అందరికీ పర్మినెంట్ లైసెన్స్‌లు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్లు ఇవే..



ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి బాలికల జట్టు

సత్తెనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు, పరిశీలకులు డాక్టర్ పి.ప్రభాకర్ సోమవారం ప్రకటించారు. బాలుర జట్టు వివరాలు ఇలా.. జె.మోజెస్ రాజు, ఎం.ముకేష్, ఈవీల్ స్మిత్, ఎ.స్టాలిన్(గుంటూరు), వి.శర్వంత్, బీఎం.సాయిచంద్ర, సీహెచ్.దుర్గా ప్రసాదు, సీహెచ్ సందీప్ (విశాఖపట్నం), కె.జయంత్, బి.అభిరామ్ రాజు, బి. ఈశ్వర్(కర్నూలు), కె.సాయి మోక్ష, ఎన్.జోయల్ (ప్రకాశం), ఎ.చైతన్య, పి.మనోజ్ కుమార్ (విజయనగరం), జి.నవదీప్ (కడప), పి.రిషీతేజ (అనంతపురం), ఎ.అబ్దుల్ మజీద్ (చిత్తూరు), స్టాండ్ బైగా బి.ఈశ్వర్ (అనంతపురం), పి.సంగీత్ (కృష్ణ), టి.కుమార్ (తూర్పు గోదావరి) ఎంపికయ్యారు. బాలికల జట్టు వివరాలు ఇలా.. బి.అనూష, ఎస్ఆర్ఎస్ఎస్ శ్రీ, లిఖిత, జి.కీర్తన (అనంతపురం), టి.అరుణ, ఎన్.దీపిక, కె.అంజనాదేవి (వైఎస్ఆర్ కడప), ఎం.పవిత్ర, టి.యామిని, ఎల్ శివ దుర్గ, బి.అఖిల (గుంటూరు), ఎస్ రేష్మ, జి. హేమ ఆసిని (విశాఖపట్నం), జి.హేమశ్రీ, వై.షైనీ (తూర్పు గోదావరి), పి.భవ్య (పశ్చిమ గోదావరి), ఎస్.మహాలక్ష్మి (విజయనగరం), సీహెచ్ పూజిత (ప్రకాశం), స్టాండ్ బైగా దీప్తి (తూర్పు గోదావరి), భవాని (పశ్చిమ గోదావరి), హెచ్ మధు (అనంతపురం), జె.శ్రీలక్ష్మి (గుంటూరు) ఎంపికయ్యారు. బాలికల జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా నారాయణరావు, లాకు పిచ్చయ్య, టి.ప్రకాష్‌రెడ్డి వ్యవహరించారు. బాలుర జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా సిటీ కౌర్, లూర్దుమేరీ, అనిల్ దత్తా నాయక్ వ్యవహరించారు. రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల జట్లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

ఉద్యోగాలు, పరిశోధనలకు విజ్ఞాన్ వర్సిటీ పెద్దపీట



మాట్లాడుతున్న వీసీ ఆచార్య నాగభూషణ్

- ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్
- వర్సిటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- విజ్ఞాన్ వర్సిటీ వీసీ ఆచార్య పి.నాగభూషణ్

గుంటూరు (విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడం వంటి సమున్నత లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి. నాగభూషణ్ సోమవారం తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ 2025-26కు సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, ఫార్మ్-డీ అడ్మిషన్ల కోసం వీశాట్ - 2025-26 నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ తాము బీటెక్‌లో అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్, కెమికల్, సివిల్, సీఎస్ఈతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, డేటాసైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈ వీఎల్ఎస్ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ, మెకానికల్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మాడీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, డిప్లొమా (సీఎస్ఈ. ఈసీఈ) కోర్సులను అందజేస్తున్నామని చెప్పారు. వీటితో పాటు బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్స్), బీఎస్సీ (ఆక్చూరియల్ సైన్స్), బీబీఏ, బీసీఏ, బీఏ (ఎల్ఎల్‌బీ), బీబీఏ (ఎల్ఎల్‌బీ), ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లిష్, పీహెచ్‌డీ కోర్సులను కూడా అందజేస్తున్నామని చెప్పారు. బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు తాము దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం కలదన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి అనుబంధంగా ప్రారంభించిన విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్‌లో విద్యార్థులకు విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వీశాట్‌లో తొలి 50లోపు ర్యాంకులు సాధించిన వారికి 50శాతం, 51 నుంచి 200లోపు ర్యాంకుల వారికి 25 శాతం, 201 నుంచి 2000లోపు ర్యాంకులు సాధించినవారికి 10 శాతం ఫీజు స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మార్కులు, జేఈఈ, మెయిన్స్, ఎంసెట్ ర్యాంకుల ఆధారంగానూ ఫీజు స్కాలర్‌షిప్‌కు అవకాశం ఉందని తెలిపారు. తమ విద్యార్థులు ప్రఖ్యాత సంస్థలైన టీసీఎస్, ఐబీఎం, విప్రో, హెచ్‌సీఎల్, సీటీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ వంటి తదితర 65 సంస్థల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీ బీటెక్ కోర్సుతోపాటుగా ఆసక్తి ఉన్న విద్యార్థులకు సమాంతరంగా సివిల్స్ కోచింగ్ కూడా ఇస్తోందని తెలిపారు. డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ కృష్ణ కిషోర్, డైరెక్టర్ అడ్మిషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.గౌరిశంకర్ రావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళందే విజయం



బాలికల కబడ్డీ జట్టుకు కప్ అందజేస్తున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం బాల, బాలికలు ప్రథమస్థానం సాధించడం అభినందనీయమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడా ప్రాంగణంలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులను వేగేశన నరేంద్రవర్మ పరిచయం చేసుకున్నారు. కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ పోటీలు బాపట్ల జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి షేక్.కరీముల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలుర కబడ్డీ పోటీల్లో అండర్-14 స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయిలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం, బాలికల కబడ్డీ పోటీల్లో అండర్ 14 స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం సాధించాయి. వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ప్రశాంతబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కేర్ విద్యాసంస్థల అధినేత వేగేశన రాధాకృష్ణరాజు, వేగేశన కిషోర్‌రాజు, ఎంఈవోలు ఉయ్యూరి వెంకటేశ్వరరావు, కె.రాజారత్నం, క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమవరంలో పట్టపగలు చోరీ

- 13 సవర్ల బంగారం, రెండు లక్షల నగదు అపహరణ

మాచవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జక్కుల సైదులు కూలీల ముఠామేస్త్రిగా పని చేస్తుంటాడు. రోజు వారి లాగానే కూలీలను తీసుకొని పొలానికి వెళ్లాడు. ఇదే అదునుగా గమనించిన చోరులు మధ్యాహ్నం ఇంటికి వేసిన రెండు తాళాలను పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువాను కూడా పగల గొట్టారు. బీరువాలో ఉన్న 13 సవర్ల బంగారం, రూ.2 లక్షల నగదును దొంగిలించారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళాలు పగలగొట్టి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా బీరువా తీసి ఉంచి, అందులో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బంగారం తన కుమార్తెదనీ, రూ.2 లక్షల నగదులో రూ. 1.50 లక్షలు కూలీలకు పంచాల్సిన డబ్బులనీ, మరో రూ.50 వేలు తన సొంతమని తెలిపాడు. మాచవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జక్కుల సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పల్నాడు జిల్లా క్లూస్ టీమ్ సందర్శించి వేలి ముద్రలు సేకరించారు.

ఎన్నికల హామీల అమలుకు అద్దంపట్టే బడ్జెట్

- మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలుకు అద్దంపట్టేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన చేసి కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారన్నారు. సంపదను సృష్టించాలన్న సీఎం ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన బడ్జెట్ ఇదని కితాబు ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా తల్లికి వందనం, ఉచిత బస్సుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించటం సంతోషకరమన్నారు. నీటి పారుదల శాఖకు గత ప్రభుత్వం కంటే రెండు రెట్లు అదనంగా నిధులు కేటాయించటం రైతుల్లో ఆనందాన్ని నింపుతుందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ప్రజారంజకంగా రాష్ట్ర బడ్జెట్

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని చెప్పేందుకు బడ్జెట్‌లో పొందుపరిచిన అంశాలే నిదర్శనమన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు వ్యవసాయ రంగంలో రైతులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు వేర్వేరుగా బడ్జెట్ కేటాయింపులు చేశారని తెలిపారు. రైతు సంక్షేమ పథకాలతోపాటు ప్రాజెక్టు నిర్మాణాలు, రైతాంగ సమస్యల పరిష్కారానికి సంబంధించి బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా కేటాయింపులు జరిగాయన్నారు. కేవలం వ్యవసాయమే కాకుండా ఇతర అన్ని శాఖలకు సంబంధించిన విభాగాలకు ఆయా శాఖల ద్వారానే బడ్జెట్ ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.

ఆర్థిక కష్టాల్లోనూ సానుకూలమైనది

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కష్టాల్లోనూ సానుకూల బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం రూపొందించిందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షోభంలో అవకాశాలు వెతకడం సీఎం చంద్రబాబుకు కొత్తమీ కాదనీ అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెంనాయుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి బలమైన పునాదులు వేశాలా ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తలపెట్టిన స్వర్ణాంధ్ర సంకల్పానికి ఈ బడ్జెట్ నాందిగా చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. సాగునీరు, వ్యవసాయానికి ప్రత్యేక కేటాయింపులు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. నదుల అనుసంధానం పూర్తయితే కరువు విముక్త ఆంధ్రప్రదేశ్ సాకారం అవుతుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు.

అన్నివర్గాలకు మేలైనది

- ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ అరాచక ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పతనావస్థకు తీసుకెళ్లిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలకు మేలు చేసేదిగా ఉందన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, పంచాయతీరాజ్ రోడ్లకు నిధులు విడుదల, సంక్షేమానికి పెద్దఎత్తున నిధుల కేటాయింపు చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముమ్మందు చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. పారిశ్రామికంగా పురోగతి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగున్నాయని, అన్నివర్గాలకు ప్రయోజనం చేకూర్చే బడ్జెట్‌గా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 25 లక్షలు వసూలు

రెంటచింతల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తామని ఓ అభ్యర్థి నుంచి రూ. 25 లక్షలు తీసుకున్న వ్యక్తిపై ఎస్ఐ సీహెచ్ నాగార్జున కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రెంటచింతలకు చెందిన షేక్ మస్తాన్ బీ డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు హాజరయ్యే నిమిత్తం పేరేచర్లలోని ఓ ఎగ్జామ్ సెంటర్‌కి 2023 ఏప్రిల్‌లో వెళ్లారు. అక్కడ పరిచయమైన లోకేష్ రెడ్డి (కడప జిల్లా వాసి) ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి విడతల వారీగా రూ.25 లక్షలు వసూలు చేశాడు. ఎస్ఐ శిక్షణకు సిద్ధం కావాలంటూ తరచూ మెస్సేజ్‌లు పెట్టేవాడు. చివరకు ఇది ఫేక్ అని తెలియడంతో ఈ నెల 4న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 587.10 అడుగులు ఉంది. ఇది 305.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3490 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 16,410 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,410 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 290 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా ఆరు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

43,750 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 46,099 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,750 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 25,972 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	16000	334	8500	14000
నెంబరు. 5	10500	14000	నెంబరు. 5	9000	13500
273	9000	11500	273	--	--
341	8000	15000	341	8500	15500
4884	10000	12000	4884	14000	14000
సూపర్ 10	11500	12000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18000	తేజ	9000	17000
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	10000	15500	దేవనూరు డీలక్స్	10000	13500
తెల్లకాయలు	5000	11000	తెల్లకాయలు	5000	10500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఎమ్మెల్యే మాధవి కార్యాలయంలో జాబ్ మేళా

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి అధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 100 మంది నిరుద్యోగులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకొని, ఇంట ర్వ్యూలకు హాజరయ్యారు. శ్రీరామ్ ఫైనాన్స్, ఫెడరల్ క్యాపిటల్, వెస్ట్ సైడ్, హెచ్ఆర్ అండ్ కో, హెచ్‌వన్ హెచ్ఆర్ సంస్థ ప్రతినిధులు హాజరై 40 మందిని ఎంపిక చేశారన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్ర జ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన హామీలను నెరవేర్చాలని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ అధ్యక్షుడు ఎస్ దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీకి భయపడి రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీలో తాకట్టుపెట్టారని విమర్శించారు. నిరసనల్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులు మర్రిరాజ్ శ్రీనివాస్, జీ ఫణీరాజ్, పాశం వెంకటేశ్వరరావు, జమీల్, సునీల్, వాసు, బత్తుల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను విరమించుకోవాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ చార్జీల భారం ప్రజలపై వేయమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం ధర్నా జరిగింది. ధర్నాకు సీపీఎం నాయకులు బి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నళినికాంత్ మాట్లాడుతూ సూపర్-6 పథకాలు కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు నాయకులు ఎల్ అరుణ, ఎంఏ చిష్టి, కె శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, జి రమణ, షేక్ ఖాశిం షహీద్, షేక్ ఖాశిం వలి, ఎస్ కార్తీక్, ఆది నికల్సన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట సోమవారం భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైయిమ్‌లను పరిష్కరించి, వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. నిరసనల్లో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, పుప్పాల సత్యనారాయణ, జంగాల చైతన్య, కొల్లి రంగారెడ్డి, మేడా హనుమంతరావు, కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గుంటూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్స్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథాయాధికారి కె ఝాన్సీలక్ష్మీ, గ్రంథపాలకులు కె చిన్నపరెడ్డి, ఎన్‌నాగిరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● జేకేసి కళాశాలలో ఈనెల 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి గోపిచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తెలుగు, ఆంగ్ల భాషల్లో సెల్‌ఫోన్ వల్ల సమాజానికి లాభమా? నష్టమా అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు ఐడి కార్డు, ప్రిన్సిపల్ సంతకంతో అనుమతిపత్రం తీసుకురావాలని సూచించారు.

ఆచరణాత్మకంగానే విషయ పరిజ్ఞానం

గుంటూరు(విద్య),నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆచరణాత్మకంగానే విషయ పరిజ్ఞానం అలవడుతుందని భాష్యం జడ్ఈవో వరలక్ష్మి అన్నారు. సోమవారం భాష్యం బ్లూమ్స్‌లో ఆస్ట్రో విజన్ సంస్థ ఏర్పాటు చేసిన ప్లానిటోరియం షోను ఆమె ప్రారంభించారు. మన విశ్వం, గ్రహాలు, నక్షత్రాలు వాటి పనితీరు గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కేజీ నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా షో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ,సెకండరీ స్కూల్ ప్రిన్సిపల్స్ కవిత, గిరిజరాణి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యలు, ఫిర్యాదుల కోసం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-హైదరాబాద్, గుంటూరు-తెనాలి, గుంటూరు - విజయవాడ, గుంటూరు - విశాఖపట్నం రూట్‌లలో తిరుగుతోన్న బస్సులు, సమస్యలు, సిబ్బంది ప్రవర్తనపై ఫిర్యాదులు, సూచనలు, సలహాలు చేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు 9959225421కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా ఎస్వీఎన్ కాలనీ, నేతాజీనగర్, గుజ్జనగుండ్ల ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి అర్జీని నాణ్యతగా పరిష్కరించాలని, పరిష్కరించిన అర్జీ రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 187 అర్జీలు వచ్చాయి. జేసీ ఎ.భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో కే.శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సీఎంవో లాగిన్‌లో 112 అర్జీలు ఉన్నాయని, అందులో 82 రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అర్జీలపై దృష్టి సారించాలని ఆదేశించారు. జేసీ భార్గవతేజ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు ఎట్టి పరిస్థితుల్లో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, హార్టీకల్చర్ డీడీ రవీంద్ర, మత్స్యశాఖ ఏడీ గాలి దేముడు, డీఎస్‌వో కోమలి పద్మ, డీఈవో రేణుక తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో సీ సీ ఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

పెదనందిపాడు మండలం, నాగులపాడు మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అర్జీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు క్వింటాకు మద్దతు ధర రూ.7,521 ఉన్నా ప్రైవేటు వ్యాపారస్తులు రూ.5,000 కన్నా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘ నాయకులు కొత్త వెంకటశివరావు, నల్లమోతు రాజేంద్ర, గొల్లపూడి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వీఆర్వో, రికార్డు అసిస్టెంట్ పోస్టులను వీఆర్ఏ చేత భర్తీ చేయాలి

జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్వో, రికార్డు అసిస్టెంటు, అటెండర్, వాచ్‌మెన్ ఉద్యోగాలను వీఆర్ఏల చేత భర్తీ చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో వీఆర్ఏలు అర్జీ అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు వడ్డె బాజీబాబు, షేక్ నాగుల్ మీరావలీ, పి జయపాల్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి

మధ్యాహ్న భోజనం కార్మికులపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ అర్జీ అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ద్రాక్షావలి, సుమతి, హేమ బిందు, ముక్తేశ్వరమ్మ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుపై కార్యచరణ రూపొందించాలి

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ అమలుపై స్పష్టమైన కార్యచరణ ప్రకటించాలని కోరుతూ నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ సంఘ నాయకులు అర్జీ అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక వచ్చే వరకు డీఎస్సీ, ఇతర ఉద్యోగాల భర్తీ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో పి.దేవదానం, కే.కిషోర్, యోహాన్, గురవయ్య, ఎం.ప్రసాదు ఉన్నారు.

ఏడాదిగా వేతనం ఇవ్వడం లేదు

గ్రీన్ అంబాసిడర్‌గా విధులు నిర్వహించానని, కానీ దానికి సంబంధించిన వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారని గుంటూరు రూరల్ మండలం, తోకవారిపాలెం గ్రామానికి చెందిన దొడ్డా వసంతరావు అర్జీ అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనం ఇప్పించాలని కోరారు.

ప్రజల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం : కమిషనర్



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలో స్థానిక సమస్యల పరిష్కారానికై డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 17 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో వీధి దీపాల సమస్యలు 24 గంటల్లో పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌కు 63 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 19, ఇంజినీరింగ్ విభాగం 21, రెవెన్యూ విభాగం 3, ప్రజారోగ్య విభాగం 7, అకౌంట్స్ విభాగంకి సంబంధించి 12, ఉపా సెల్ 5, పరిపాలన విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు అందిందని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాష, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఆర్ఓలు, ఎస్ఎస్ లు పాల్గొన్నారు.

10లోగా వెండింగ్ జోన్లు ఫైనల్ : కమిషనర్

నగరపాలక సంస్థ పరిధిలో నూతన వెండింగ్ కమిటీ ఏర్పాటు చేసుకొని, డిసెంబర్ 10వ తేదీలోపు వెండింగ్ జోన్లను ఫైనల్ చేసుకోవడానికి వీధి వ్యాపారులు, ఆయా సంఘాల ప్రతినిధులు సహకరించాలని, రోడ్లు, డ్రెయిన్ల మీద ఆక్రమణల తొలగింపు జరుగుతుందని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారుల సమస్యలు, వెండింగ్ కమిటి ఏర్పాటు, వెండింగ్ జోన్ల నిర్ధారణ తదితర అంశాలపై వెండింగ్ కమిటి సభ్యులు, ట్రాఫిక్, ఆర్ అండ్ బి, ట్రాన్స్‌పోర్టు, మెప్మా, సీపీడీసీఎల్, జిఎంసి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి, వారికి మెరుగైన సంక్షేమ చర్యలు తీసుకోవడానికి ముందుంటామన్నారు. వీధి వ్యాపారుల దగ్గర అద్దెల పేరుతో దోచుకుంటున్న దళారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జోన్ల ఏర్పాటు వలన ఆయా వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులు, పిఎం స్వానిధి బ్యాంక్ రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అలాగే ఈనెల 14 నుంచి జిఎంసి ప్రధాన కార్యాలయంలో వీధి వ్యాపారుల గుర్తింపు దరఖాస్తులను పరిశీలన చేసి గుర్తింపు కార్డ్ లు అందిస్తామని తెలిపారు.

సోలార్ విద్యుత్‌పై అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నగరపాలక సంస్థ ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని పోస్టల్ డిపార్టుమెంట్, సోలార్ విద్యుత్ పై అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జిఎంసి ఉద్యోగులకు పోస్టల్, పిఎం సూర్య ఘర్‌లో సోలార్ విద్యుత్ తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం పోస్టల్ స్కీమ్స్‌ని పోస్టల్ అసిస్టెంట్ షాహెదా, సోలార్ విద్యుత్‌పై సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిఎంసి ఉద్యోగులకు వివరించారు.

నేడు కమర్షియల్ భవన యజమానులతో కమిషనర్ సమావేశం

నగరపాలక సంస్థ పరిధిలోని కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, ఫంక్షన్ హాల్స్ ఉన్న హోటల్స్ యజమానులతో వ్యర్థాల నిర్వహణపై మంగళవారం ఉదయం 10.30 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరుగుతుందని, ఆయా హాల్స్ యజమానులు సమావేశానికి హాజరు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీసీలకు అన్ని రకాల పరిశ్రమల స్థాపనకు అవకాశాలు కల్పించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు తదితరులు

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్ని రకాల పరిశ్రమల స్థాపనకు అవకాశాలు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కోరారు. సచివాలయంలోని చాంబర్‌లో మంత్రిని సోమవారం కలిసిన కేసన ఇతర నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం కేసన మాట్లాడుతూ బీసీలకు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అవకాశం కల్పించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు ఉన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ



రవీంద్రనగర్‌లో శివాలయంలో పూజలు

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రెండవ కార్తీక సోమవారంను మహిళలు భక్తి శ్రద్ధలలో నిర్వహించారు. పలు శివాలయాలు కార్తీక శోభను సంతరించుకుంది.. రవీంద్రనగర్, కొత్తపేట, అరండల్‌పేట, బ్రాడీపేట, ఆర్ అగ్రహారం, పాతగుంటూరు తదితర శివాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. ఉదయమంతా ఉపవాస దీక్షలు చేసిన భక్తులు, సాయంత్రం దేవాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. శివాలయాల్లో దీపారాధనలు నిర్వహించారు.



దీపారాధన చేస్తున్న మహిళలు

పేదలకు విద్యని చేరువచేయాలి : కలెక్టర్



అబుల్ కలాం ఆజాద్ జయంతిలో పాల్గొన్న కలెక్టర్

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారతదేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రిగా పని చేసిన మౌలాన అబుల్ కలాం ఆజాద్ ప్రతి పేదవాడికి విద్య అందించాలనే దూర దృష్టి కలవారని, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఎదగాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆకాంక్షించారు. సోమవారం కలక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో ఆజాద్ జయంతి వేడుకలు జరిగాయి. కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఈవో రేణుక, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ షరీఫ్, డిప్యూటీ మేయర్ సజీల ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముగ్గురు ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపిక అందించారు. చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉన్నత విద్యా స్థాపకుడు అబుల్‌కలాం ఆజాద్

దేశంలో ఉన్నత విద్య స్థాపనలో భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే గల్లా మాధవి కొనియాడారు. ఆయన 137వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

గుంటూరు సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తారీకు నుంచి ప్రారంభం కాబోయే క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించి రూపొందించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో జరిగిన కార్య క్రమంలో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జేసీ ఏ భార్గవ్‌తేజతో కలసి ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర బాలల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఈనెల 14వ తారీకు నుంచి గురు, శనివారాల్లో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠ శాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారి ఎదుగుదల లోపాలను గుర్తించుటకు స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమం ప్రారంభి స్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ, డీసీహెచ్ఎస్ మయాన మజీదా, డీపీఎంవో రత్నమన్మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సర్వేజనా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముత్యాల రెడ్డినగర్‌లో 150 మంది పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, 43వ డివిజన్ కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ఇస్రో నాసా అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు హాజరై విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, పెన్నులను అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు సాలిమిట్టి మార్, సాలిముట్టి పవన్ బాబు, ప్రశాంతి కుమారి, దాసరి శంకర్, దాసరి సతీష్ , దాసరి రమేష్, కర్రీ రత్నం పాల్గొన్నారు.

18న ఘంటసాల సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ కళావేదికపై ఈ నెల 18వ తేదిన అమరగాయకుడు ఘంటసాల సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నట్లు ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక అన్నదాన సమాజ కళా వేదికపై పదేళ్ల నవ్యాంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి అనే అంశంపై సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతిలో 25 అడుగుల ఘంటసాల విగ్రహం, మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ మిరియాల ప్రసాదరావు, కో కన్వీనర్ డి.బాలస్వామి, మద్దు వెంకటస్వామి, ఎస్ సాంబయ్య, మిరియాల గోపి, తుములూరి రాజేంద్ర, కే బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు హరిప్రసాద్ చిరస్మరణీయులు

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులుగా పని చేస్తూ అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ అందరి అభిమానం పొందిన డాక్టర్ దివి హరిప్రసాద్ చిరస్మరణీయులు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. ఇటీవల మృతి చెందిన ఆయుర్వేద వైద్యులు దివి హరిప్రసాద్ సంస్మరణ కార్యక్రమం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగింది.

ఉషోదయ స్కూల్ ప్రిన్సిపల్ నస్రీన్‌కు డాక్టరేట్

గుంటూరు(విద్య),నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్, చేతన ఆధ్వర్యంలో నిర్వహించే ఉషోదయ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న ఎండీ నస్రీన్‌కు మహారాజా అగ్రసేన్ హిమాలయన్ గఢ్వాల్ విశ్వవిద్యాలయ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అనితా నాయర్, ఖలీద్ హుస్సేనీ నవలలలో 'మహిళా కథానాయకులు.. స్త్రీవాద విధానం' అనే అంశం మీద ఆంగ్లంలో పరిశోధన చేసినట్లు తెలిపారు. నస్రీన్‌ను బాలకుటీర్ సహకార్యదర్శి జయశ్రీ, సీఏట యన్. దుర్గారఘురామ్, చేతన కార్య నిర్వాహకురాలు మరుద్వతి తదితరులు అభినందించారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయురాలిని సత్కరించిన ఎన్‌టీఏ నాయకులు

గుంటూరు(విద్య),నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని కాసు శాయమ్మ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా పనిచేస్తూ పదోన్నతి పొందిన జివి పద్మావతిని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.హైమారావు తదితరులు సోమవారం అభినందించారు. ఇటీవల నిర్వహించిన పదోన్నతుల్లో జివి పద్మావతి ఎన్జీవో కాలనీలోని కోనబాలప్రభాకరరావు మున్సిపల్ స్కూల్‌లో హెచ్‌ఎంగా బాధ్యతలుస్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి శివకుమారి జె రమాదేవి, జె విజయానంద్, వి తనూజ, ఐ రమ, సీహెచ్ చంద్రశేఖర్, షేక్ సమీర్, కె.జయలక్ష్మి అభినందించారు.

మాలదాసరి వృత్తాంతంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం సాయంత్రం తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకిచే ఆముక్తమాల్యద మాలదాసరి వృత్తాంతంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ధ్వంసమైన కల్వర్టు

శివరామ్‌నగర్ ప్రజలకు కల్వర్టు కష్టాలు



ఏటీ అగ్రహారం(గుంటూరు విద్య),నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ క్వార్టర్స్‌లోని సిమెంటు రోడ్డు నుంచి శివరామ్‌నగర్ వెళ్ళే దారిలో ఉన్న కల్వర్టు ఇటీవల నగరంలో కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైంది. దీనిని పునఃనిర్మించడం లేదా మరమ్మతులు చేయాలని స్థానికులు చేస్తున్న విజ్ఞప్తిని నగర పాలకులు పట్టించుకోవడం లేదు. క్వల్వర్టు లేకపోవడంతో జడ్పీ క్వార్టర్స్ నుంచి శివరామ్‌నగర్, చుట్టుగుంట, ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కల్వర్టుకు మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించారని, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేశారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో సోమవారం పాల్గొన్న ఆమె బడ్జెట్ కేటాయింపులపై హర్షం వ్యక్తం చేశారు. 2.94 లక్షల కోట్లతో ఆంధ్రప్రదేశ్ భారీ బడ్జెట్ రూపొందించిన కూటమి ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసారని ఆమె చెప్పారు. బీసీల సంక్షేమానికి బడ్జెట్లో రూ.39,007 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. రజకులు, దూదేకులు, నాయిబ్రాహ్మణులు వంటి సంప్రదాయ వృత్తుల వారి జీవనోపాధిని పెంచటానికి ఆర్థిక సహాయం అందించారు. గుంటూరు వంటి ప్రధాన నగరాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల సుడిగుండంలోకి నెట్టి వేసిందని, దాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతోందని చెప్పారు.

స్వర్ణాంధ్ర స్థాపనకు రాష్ట్ర బడ్జెట్ పునాది : దేగల



గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ స్థాపనకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పునాది అవుతుందని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు అద్దం పట్టే విధంగా ఉందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాలకు ప్రతిబింబంగా బడ్జెట్ ఉందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా మరో రెండు పథకాలైన అమ్మఒడి, ఉచిత బస్సు పథకానికి ఈ బడ్జెట్లో నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చేందుకు నీటిపారుదుల శాఖకు గత ప్రభుత్వం కంటే రెండు రెట్ల అదనపు నిధులు కేటాయించడం రైతులను ఆనందాన్ని నింపుతుందన్నారు. జగన్ పాలన విధ్వంసం నుంచి స్వర్ణాంధ్ర సాధన దిశగా ఏపీ బడ్జెట్ ఉందన్నారు.

దేశంలోనే గొప్ప బడ్జెట్ : దామచర్ల

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నప్పటికీ దేశంలోనే అత్యున్నతమైన బడ్జెట్‌ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు కొనియాడారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అమ్మ ఒడి, ఉచిత బస్సు పథకానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, మేళం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మహిళలను మోసం చేసిన ఏఎస్ఐ

● ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో ఏఎస్ఐగా పని చేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తి చట్ట విరుద్ధంగా చీటీ పాటలను నిర్వహించడమే కాకుండా అందులో సభ్యురాలుగా చేరిన ఓ మహిళకు రూ.20లక్షలు ఇవ్వకుండా మోసం చేశాడు. అంతేకాక చీటీ పాటలో శిబిరాలుగా చేరిన సమయంలో తీసుకున్న చెక్కు, నోట్‌ను వేరొకరి పేరుతో ఏడు లక్షలు ఇవ్వాలంటూ కోర్టులో కేసు వేయించాడు. ఆయన అన్నా వదిన వైసీపీ నాయకులు కావడంతో గత ప్రభుత్వంలో వారి బెదిరింపులకు భయపడి బయటకు రాలేకపోయినా అని బాధితురాలు వాపోయారు ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

విదేశాల్లో ఉద్యోగం కల్పిస్తామని రూ.55 లక్షలతో మోసం

విదేశాల్లో వీసా కల్పించడమే కాకుండా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి 15 లక్షల చొప్పున రూ.55 లక్షలు తీసుకొని తమను మోసం చేశాడని చంద్రమౌళినగర్‌కు చెం దిన ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. అంకిరెడ్డిపాలెంకు చెందిన ఆయన గుంటూరులో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. గతంలో తన ద్వారానే యూకే వెళ్లిన కొరిటెపాడు 4వ లైనుకు చెందిన జొన్నల విజయ సింహారెడ్డి అనే వ్యక్తి లండన్‌లో జాబ్ కన్సల్టెన్సీ నిర్వహిస్తూ తాను జాబ్ వీసా ఇప్పిస్తానని చెప్పి తన వద్దకు వచ్చిన నలు గురి నుంచి రూ.55 లక్షలు తీసుకున్నాడని తెలిపారు. ప్రియాంక, ఇంద్రజ, యశ్వంత్‌రెడ్డి, మహేష్ తదితరులు రూ.55 లక్షలు చెల్లించారన్నారు. డబ్బు తీసుకొని నెలలు గడుస్తున్నా ఎటువంటి స్పందన లేదని చివరకు తన ఫోన్ కూడా తీయడం లేదని బాధితుడు వాపోయారు. చట్టప్రకారం చర్యలు తీసు కుని న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

ఖాళీ చేయకుంటే ఇల్లు తగల పెడతామని బెదిరిస్తున్నారు

పేద వర్గానికి చెందిన తామంతా నాలుగైదు సంవత్సరాల క్రితం వెంగళాయపాలెంలో స్థలాలు కొనుక్కొని ఇల్లు నిర్మించుకుని ఉంటుండగా కొందరు వ్యక్తులు ఇళ్ళు తగలబెడతామని బెదిరిస్తున్నారని సోమవారం పెద్దసంఖ్యలో బాధిత మహిళలు పోలీస్ కార్యాలయానికి వచ్చారు. ఆయా స్థలాల యజమానులు గతంలోనే అమ్మేసుకున్నారని, వారి నుంచి తాము కొనుగోలు చేశామని తెలిపారు. సుమారు 150 కుటుంబాలకు చెందినవారు అక్కడ స్థలాలు కొనుగోలు చేసి ఇల్లు కట్టుకొని నివాసం ఉంటుండగా అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయన్నారు. అయితే కొద్దిరోజులు వెంగళాయపాలెంకు చెందిన కొందరు వ్యక్తులు ఆస్థలాలు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారన్నారు.

ఈ క్రమంలో ఇటీవల ఏసీబీ దాడిలో పట్టుబడిన షేక్ హసీనా కొద్ది రోజుల క్రితం తమకు నోటుసులు ఇచ్చిందన్నారు. స్థలాలు కొనుగోలు చేసిన డాక్యుమెంట్లున్నాయని.. తనకు సంబంధం లేని విషయంలో వీఆర్వో నోటీసులు పంపారన్నారు. స్థల యజమానులుగా చెప్పుకుంటున్న వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కుమార్‌రావు చిన్న వెంకటేశ్వర్లు తదితరులు తమ స్థలాల వద్దకు వచ్చి వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని లేదంటే రాత్రి వేళ గుడిసెలను తగలపెడతామని బెదిరిస్తున్నారని బాధిత మహిళలు పోయారు.

నాలుగేళ్ల బాలిక అదృశ్యం



తేజస్విని

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద నాలుగేళ్ల బాలిక అదృశ్యమైంది. మూడావత్ తేజస్విని అనే నాలుగు సంవత్సరాల బాలిక అదృశ్యమైన సంఘటనపై సోమవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టా రు. ఈ నెల 9వ తేదీన బాలికను తీసుకొని తల్లిదండ్రులు రాజేష్, పద్మలు పాత బస్టాండ్ సమీపంలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రాంతానికి వచ్చారు. బాలికను షాపింగ్‌మాల్ పక్కన మెట్ల మీద కూర్చోబెట్టి వారు టిఫిన్ కోసం వెళ్లారు. తిరిగి వచ్చే లోగా బాలిక కనిపించలేదు. తల్లిదండ్రు లు సమీప ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రులు ఒడిస్సా ప్రాంతానికి చెందినవారు కాగా కొంత కాలంగా వారు చందనా బ్రదర్స్ షాపింగ్ మాల్‌కు వాచ్‌మన్‌లుగా పని చేస్తున్నారు. కాగా సోమవా రం బాలిక తల్లిదండ్రులు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ బాలిక అదృశ్య సంఘటనపై సీఐ శివప్రసాద్ తో మాట్లాడి తెలుసుకున్నారు. పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమె రాలు పరిశీలనపై సీఐతో పాటు సిబ్బంది దృష్టి సారించారు. వీలైనంత త్వరగా బాలిక ఆచూకీ కనుగొంటామని సీఐ తెలిపారు.

శివోహం..



- శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపారాధనలు
- భక్తజన సంద్రంగా అమరావతి అమరేశ్వరాలయం
- కోటప్పకొండలో భక్తుల కోలాహలం
- కాకాని మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పవిత్ర కార్తీకమాసం రెండవ సోమవారం ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. 'ఓం నమశ్శివాయ.. హర హర మహాదేవ.. శంభో శంకర' మంత్రోచ్ఛరణలను పఠిస్తూ భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అమరావతి శ్రీ అమరేశ్వరాలయం, పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం, నరసరావుపేట కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయం, బాపట్ల పట్టణంలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే ప్రముఖ పర్యాటక ప్రాంతం సూర్యలంక సముద్ర తీరంలో భక్తులు కార్తీకమాస పుణ్యస్నానాలను ఆచరించి, పూజలను నిర్వహించారు.

అమరావతి, నరసరావుపేట, బాపట్లరూరల్, పెదకాకాని, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామంగా దేవేంద్రునిచే ప్రతిష్ఠించినట్లు పేర్కొన్న అమరావతిలోని అమరేశ్వరాలయం భక్తజనంతో సంద్రంగా మారింది. పంచారామాలు దర్శించుకునే భక్తులు ఆదివారం అర్ధరాత్రి నుండి ప్రత్యేక వాహనాలలో ఆలయానికి చేరుకుని తెల్లవారు జామున రెండు గంటలనుండి పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీకదీపాలు వెలిగించారు. కార్తీకదీపాలను కృష్ణమ్మ అలలపై వదలి ఆరనీకుమా ఈదీపం కార్తీకదీపం అంటూ తమ భక్తిభావం చాటుకున్నారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో రావడంతో కృష్ణాతీరం, ఆలయ ప్రాంగణము, ప్రధాన రహదారిలో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. భక్తులకు ఆలయ అధికారులు తాగునీరు, ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఏఎస్పీ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో పలువురు సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.సునీల్‌కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్తీకదీపాలతో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు దంపతులు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



శ్రీ త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురష్కరించుకోని శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీమేధా దక్షిణామూర్తి స్వరూప శ్రీత్రికోటేశ్వర స్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి శ్రీత్రికోటేశ్వర స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ అధికారులు నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి కొండకు ప్రత్యేక సర్వీసులు నడిపారు.

సూర్యలంక తీరం ఒడ్డున కార్తీకమాస పూజలు

ఎంతో పవిత్రమైన కార్తీకమాసం రెండోవ సోమవారం బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో భక్తులు పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే తీరంకు చేరుకొని భక్తులు సూర్యలంకతీరంలో పుణ్యస్నానాలను ఆచరించి తీరం ఒడ్డున ఇసుకతిమ్మెలతో శివలింగాలను నిర్మించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు తీరం ఒడ్డున కార్తీకదీపాలను వెలిగించి పూజలను నిర్వహించి అనంతరం సముద్రదేవునికి తాంబూలాన్ని సమర్పించారు. తీరం ఒడ్డున కార్తీక పూజలు జరిపిన అనంతరం బాపట్ల పట్టణంలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి తరలి వెళ్లి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్తీక మాసం రెండోవ సోమవారం కావటంతో సూర్యలంకతీరం భక్తులతో పరవశించిపోయింది. తీరానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బాపట్లరూరల్, మెరైన్ పోలీసులు బందోభస్తును నిర్వహించారు.



బాపట్ల సూర్యలంక సముద్రతీరం ఒడ్డున ఇసుకతో శివలింగాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు





కాకాని మల్లన్న సన్నిధిలో కార్తీక దీపాలంకరణలు

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలోని యజ్ఞాల బావి వద్ద భక్తులు కార్తీకమాస స్నానమాచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణములో కార్తీక దీపారాధనలు చేశారు. క్యూలలోని భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. శ్రీ స్వామి వారి నిత్య అన్నప్రసాద భవనంలో భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కళ్యాణ కట్ట వద్ద పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయ అన్ని విభాగాలలోని కార్యక్రమాలను ఆలయ ఉప కమిషనరు కేబీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్తీకమాస 2వ సోమవారం వివిధ సేవా రుసుములు, ప్రసాదం విక్రయం, అన్నప్రసాద విరాళముల ద్వారా రూ.6,50,000 పై చిలుకు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఉప కమిషనరు తెలిపారు. పోలీసు, అగ్నిమాపక, పంచాయతి, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొన్నట్లు ఉప కమిషనరు తెలిపారు.

అమరావతికి ఆన్‌లైన్ రివర్ వాటర్
క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్

● ఔత్సాహికుల నుంచి టెండర్లు ఆహ్వానం

విజయవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నగరానికి సురక్షిత మంచినీటిని అందించేందుకు వీలుగా సీఆర్‌డీఏ అధికారులు 'ఆన్‌లైన్ రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్' ఏర్పాటుకు ఈవోఐ పిలిచారు. రాజధాని ప్రాంతానికి అందించే మంచినీరు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు కృష్ణానదిలోని నీటి వనరుల నాణ్యతను పరిశీలించేందుకు ఈ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఇదంతా ఆన్‌లైన్ విధానంలో పని చేస్తుంది. ఆన్‌లైన్ రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్లను సీఆర్‌డీఏ కోరింది. ఈ నెల 15వ తేదీలోపు ఔత్సాహికులు తమ టెండర్లను అందజేయాలని తెలిపింది.

అభివృద్ధి, సంక్షేమానికి
రాష్ట్ర బడ్జెట్ దోహదం

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరుసిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర సంక్షేమం అభివృద్ధికి దోహదపడుతుందని ఉమ్మడి గుంటూరుజిల్లా పరిషత్ ఛైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌పై సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి రూ. 2లక్షల 94వేల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేస్తుందన్నారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖకు రూ.16,739కోట్ల కేటాయింపు హర్షణీయమన్నారు. అదేవిధంగా బీసీ సంక్షేమానికి రూ.39 వేల ఏడు కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.18,497కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7557 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.4,376 కోట్లు, మహిళాశిశు సంక్షేమానికి రూ.4285 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.4012 కోట్లు, పరిశ్రమలు వాణిజ్యానికి రూ.3127 కోట్లు, ఇంధన రంగానికి రూ.8207 కోట్లు, పట్టణ అభివృద్ధికి రూ.11490కోట్లు కేటాయించడం అభినందనీయమని అన్నారు. ఇంకా కొన్నిశాఖలకు ప్రభుత్వం కేటాయించిన నిధులవలన ప్రయోజనం కలుగుతుందని, గతప్రభుత్వంలో బడ్జెట్‌లో కేటాయించినవి ఆయాశాఖలకు అందలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

గంజాయి మత్తులో విద్యార్థులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరేంద్రబాబు, కింద కూర్చొనివున్న నిందితులు

- ● 25 మంది సభ్యుల ముఠా అరెస్టు
- ● 7.2 కిలోల గంజాయి స్వాధీనం
- ● నిందితుల్లో అత్యధిక మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులే ..
- ● వివరాలు తెలిపిన గుంటూరు పట్టాభిపురం సీఐ .. మిగిలిన వారిని పట్టుకుంటామని వెల్లడి

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఏడుగురుతో పాటు తాగుతున్న 18 మందిని పట్టాభిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేసారు. వారి నుంచి 7.2 కిలోల గంజాయి, రూ. 3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో ఎక్కువ మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉండటం ఆందోళన కలిగించే విషయం. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీరేంద్రబాబు ఈ కేసులోని నిందితుల వివరాలను వెల్లడించారు.

నగరంలో శ్రీనివసరావుపేట, సంగడిగుంట, చంద్రాబాబు కాలని, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామానికి చెందిన అల్తాఫ్ దావుద్దిన్, రోషన్, యూసుఫ్‌లు ముగ్గురు ఓ కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం, అనిల్ డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నారు. యూసుఫ్ మెకానిక్ గాను, సుధాకర్ వంట మేస్త్రి గాను, బాలాజీ కూలి పనులు చేసుకుంటూ ఉండేవారు. వీరంతా గంజాయి, చెడు అలవాట్లకు బానిసలుగా మారి తమ వ్యసనాలకు అవసరమైన డబ్బుల కోసం గంజాయి అమ్మేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో అల్తాఫ్, దావుద్దిన్, రోషన్, బాలజీలు గత నెల 8న వారి ద్విచక్రవాహనాలపై అరకు వెళ్లి భీం, దీపక్ అనే ఇద్దరి వద్ద గంజాయి కొన్నారు. గుంటూరులో గంజాయిని ఇతరులకు లాభానికి అమ్మే అనిల్, సుధాకర్‌లను కలిశారు. వీరంతా సోమవారం నేతాజీ నగర్ చెరువు వద్దకు వచ్చి ఉండగా పట్టాభిపురం పోలీసులు వారిని పట్టుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరకు నుంచి గంజాయి తెచ్చి అమ్ముతున్న శ్రీనివాసరావుపేట 11వ లైనుకు చెందిన షేక్ అల్తాఫ్, సంగడిగుంట 11వ లైనుకు చెందిన మొహమ్మద్ దావుద్దిన్, శ్రీనివాసరావుపేట 1వ లైనుకు చెందిన షేక్ యూసుఫ్, తన్నీరు బాలాజీ, కొత్తపేట 1వ లైనుకు చెందిన షేక్ రోషన్, శావల్యాపురం మండలం పిచికలపాలెంకు చెందిన ఏగినాటి. అనిల్, చంద్రబాబు కాలని 6వ లైను, పొన్నూరు రోడ్డుకు చెందిన పందిరి సుధాకర్ తదితరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అదే విదంగా గంజాయి తాగుతున్న గౌడ లిఖిత్ (నల్లపాడు), కుంచేపు శ్యాం కుమార్ (కేవీపీ కాలనీ), పాకాల కిరణ్ బాబు (గడ్డిపాడు), సిరిగిరి వెంకట శివ (శ్రీనివసరావుపేట 6వ లైను), తోట వెంకటేష్(బ్రాడిపేట 6/21), అవుకు సాయి తేజ (ఫాతిమా పురం 4వ లైను), మద్దు మౌనిష్ (శ్రీనివసరావుపేట సుజాత కాన్వెంట్ వెనుక), అలపాటి వెంకట సుధీర్ బాబు (కొరిటెపాడు), పెద్దింటి చరణ్ (చాగల్లు గ్రామం, తూర్పు గోదావరి జిల్లా), కొప్పుల నితిన్ (డొంకరోడ్డు, కాకుమానువారి తోట), యామ ప్రణవ గణేష్ (బాలాజీ నగర్ 4వ లైను, రెడ్డిపాలెం), కొక్కిలిగడ్డ దిలీప్(మైనేని కాలని), భూషణ్ పాణిగ్రాహి(మెళియాపుట్టి, రాత్తిని, శ్రీకాకుళం జిల్లా), హరికొట్ల జయంత్(ఖమ్మం పట్టణం), అబ్బూరి భాస్కర్(ఖమ్మం పట్టణం), పుట్టగుంట రానసింహ దత్తు(జేకేసీ కాలేజీ రోడ్డు), మన్నే తులసిరాం (నాయుడుపేట 2వ లైను కొరిటెపాడు), బిల్లా రబ్బాని (కేవీపీ కాలని1/4) తదితరులను అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసారు. అదేవిధంగా అరకులో వీరికి గంజాయి విక్రయించిన భీం, దీపక్‌లను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ వీరేంద్రబాబు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ వీరేంద్రబాబు, ఎస్ఐ నరహరి, ఏఎస్ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుళ్ళు వాకా రామారావు, బీ నరసింహారావు, కానిస్టేబుళ్ళు వై మానిక్యాలరావు, బీ బ్రహ్మం, సైదులు, పీ శివనాగరాజు, శేఖర్ తదితరులను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

బడుగు, బలహీనవర్గాల ఆశీస్సులే
నా ఎదుగుదలకు కారణం

● టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'నా రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. రెండు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీ, మూడుసార్లు టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎన్నికయ్యానంటే బడుగు బలహీనవర్గాల ప్రజల దీవెనలే కారణం. వారిని ఎప్పటికీ మర్చిపోను' అని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. సోమవారం నారాయణపురంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జంగా కృష్ణమూర్తికి పల్నాడు బడుగు బలహీన వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్మానసభ జరిగింది. సభకు ముఖ్యఅతిధిగా హాజరైన జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా మొదలైన తన రాజకీయ జీవితం గ్రామ సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా నియామకం కావడానికి బడుగు బలహీనవర్గాలకోసం తాను చేసిన పోరాటమే కారణమన్నారు. పల్నాడు ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రం నలుమూలల వున్న ఎంతో మంది బడుగు బలహీన వర్గాల నాయకులు ఐక్యంగా వుండి ఆర్థిక, సామాజిక, రాజకీయంగా పురోభివృద్ధి సాధించాలన్నారు. తనకు టీటీడీ బోర్డు సభ్యుడిగా పదవి రావడానికి సహకరించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సభకు దాచేపల్లి 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బెహరా వెంకట శ్రీనివాసరావు, గద్దల వేదమణి, కనిగిరి విశ్వనాథం, మందా శంకర్, పెరుమాళ్ల వెంకట నరసింహారావు, హసన్ అహ్మద్, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నిర్లక్ష్యానికి మందు లేదు !



ఒక పక్క ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులులేక రోగులు అల్లాడిపోతున్నారు. వచ్చిన మందులను వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రులకు పంపిణీ చేయకుం డా వ్యర్థం చేస్తున్నారు. ఆ మాటలకు బలం చేకూర్చేదే ఈ చిత్రం. గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సెంట్రల్ డ్రగ్‌స్టోర్ పక్కనేవున్న భవనం లో రోగులకు అందజేయాల్సిన మందులను ఇలా వరండాలో బయట పడేసారు. అవి వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతున్నాయి. జిల్లా కార్యాలయంలోనే ఈ స్థాయిలో నిర్లక్ష్యం ఉంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పరిస్థితి ఏమిటో.! - గుంటూరు సిటీ

యూనియన్ బ్యాంక్
విశేష సేవలు

- ● దేశవ్యాప్తంగా 8,500 శాఖలు
- ● 9000 ఏటీఎంలు
- ● ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరి మెండు మహేంద్ర భాస్కరరావు

కర్లపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో 1919 సంవత్సరంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాలుగు బ్రాంచ్‌లతో ప్రారంభమై నేడు 8,500 బ్రాంచ్‌లకు విస్తరించిందని, 9000 ఏటిఎంలతో ఖాతాదారులకు విశేష సేవలదిస్తుందని ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ జనరల్‌సెక్రటరి మెండు మహేంద్రభాస్కరరావుఅన్నారు. యూనియన్ బ్యాంక్ కర్లపాలెంశాఖలో సోమవారం 106వ ఫౌండేషన్ దినోత్సవాన్ని మేనేజర్ కె.మానసా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాస్కరరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1973వ సంవత్సరంలో కర్లపాలెంలో



కేక్ కట్ చేస్తున్న మెండు మహేంద్రభాస్కరరావు

యూనియన్ బ్యాంక్ స్థాపించారని, 30 వేల మంది ఖాతాదారులకు యూనియన్ బ్యాంక్ విశేష సేవలం దిస్తుందన్నారు. చిన్న వృత్తి, వ్యవసాయాదారులకు, చేతి వృత్తిదారులకు, స్వయం సహాయక సంఘాలకు, చిన్నపెద్ద పరిశ్రమలకు అనేక రంగాల వారికి యూనియన్ బ్యాంక్ ఆర్థికసాయం అందిస్తూం దేశ, ఆర్థిక సామాజిక అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రస్తుత ఎండీ, సీఈవో మని మొక్కలాయ్ వివిధ రంగాల్లో బ్యాంక్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సిబ్బంది కృషితోనే బ్యాంక్ నేడు ఈ స్థాయికి చేరుకుందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.మానస, ఏపిఎమ్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేనేజర్ బాను, యూనియన్‌బ్యాంక్ సిబ్బంది అనీషా, మనోజ్, గోపి, జగదీష్‌కుమార్, రాజమోహన్‌రెడ్డి, జనకమహరాజు, ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి
బేస్‌బాల్ పోటీలు

- ◆ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటిన గుంటూరు జిల్లా జట్టు
- ◆ బాల, బాలికల విభాగంలో అండర్ 17కు ఎంపికైన నేషనల్ టీం



రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముఖ్య అతిథులు

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుటూరుజిల్లా, యనమదల మండల పరిధిలోని యనమదల జడ్పీ హైస్కూల్లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు సోమవారం ముగిసాయి. జాతీయ జట్టుకు ఎంపికలతో పాటు వివిధ జిల్లాల మధ్య పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా బాలికలు సత్తాచాటి రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్రం తరుపు నుంచి ప్రాతినిధ్యం వహించే జట్టును అన్ని జిల్లాల క్రీడాకారుల నుంచి ఎంపిక చేశారు. సెమీఫైనల్స్‌కు బాల బాలికల విభాగాలలో 8 జిల్లాల జట్లు తలపడగా అందులో 4 జిల్లా జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలలో బాలికల విభాగంలో ప్రథమస్థానంలో గుంటూరు జిల్లా, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, మూడవ స్థానంలో విజయనగరం, నాలుగవ స్థానంలో ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో విజయనగరం, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, మూడవ స్థానంలో ప్రకాశం, నాలుగవ స్థానంలో కర్నూలు జిల్లా జట్లు నిలిచాయి. అనంతరం రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ పి.బాలసుబ్రమణ్యం,సర్పంచ్ ఆదినారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ చౌదరిబాబులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం నాగేశ్వరరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరావు, ఇంటర్నేషనల్ సాఫ్ట్‌బాల్ రెఫరీ జగదీష్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ పేరం మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విజయనగరం జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముఖ్య అతిథులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

18న ఘంటసాల సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ కళావేదికపై ఈ నెల 18వ తేదిన అమరగాయకుడు ఘంటసాల సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నట్టు ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

16న మండల పరిషత్

సర్వసభ్య సమావేశం

దుగ్గిరాల(ఆంధ్రజ్యోతి), నవంబరు 11: ఈనెల 16వ తేదీన దుగ్గిరాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అడిగొప్పుల శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు జరుగు సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

కాకుమాను, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం , బుధవారం పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యుగకీర్తి సోమవారం ఒక ప్రటకనలో తెలిపారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికల గురించి శిక్షణ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరవ్వాలని సంబంధిత శాఖ అధికారులను, ప్రజా ప్రతినిధులను విజ్ఞప్తి చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెదనందిపాడు, నవంబరు 11 ఆటోలో అక్రమంగా రేషన్ తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి బియ్యాన్ని పట్టుకున్న సంఘటన మండల పరిధిలోని రావిపాడులో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ మధు పవన్ తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండలం నుంచి వంగిపురం పరిసర గ్రామాలలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కోళ్ల ఫారాలకు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆటో డ్రైవర్ తన్నీరు బాజిబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ విద్యా దినోత్సవం

కాకుమాను, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కాకుమాను ఉర్దూ పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి కె.ఎఫ్. కెన్నడీ, విజయ్‌భాస్కర్ భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో సిప్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల అంతర్జాతీయ అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 11 దేశాల నుంచి విచ్చేసిన ఆరు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ పోటీల్లో తాడేపల్లిశాఖకు చెందిన 10 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి వివిధ స్థాయిల్లో విజయాలు సాధించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ విక్టర్, డైరెక్టర్ సిబ్బి శేఖర్, దక్షిణ భారతదేశ ప్రతినిధి ప్రవీణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధి గోపాల కృష్ణ విజేతలకు బహుమతులు అందించారు. తాడేపల్లి శాఖ నిర్వాహకురాలు జాహ్నవి సోమవారం విలేకరుల సమావేశంలో విజేతల వివరాలను వెల్లడించారు.

ప్రజామోద బడ్జెట్

తాడేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, ఆర్థిక కష్టాల్లో ఉన్నా సానుకూల నమ్మకం కలిగించేలా బడ్జెట్ ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. సోమవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ సాగునీరు వ్యవసాయానికి భారీగా నిధులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి ప్రజలు, రైతులు జేజేలు తెలుపుతున్నారన్నారు. ఐదేళ్లలో జగన్ లెక్కా పత్రంలేకుండా ఖర్చులు, నిధులు మళ్లించారని ఆరోపించారు. చేసిన వాటికి జవాబు చెప్పాల్సి వస్తుందని అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేశారని ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు.

పదేళ్ల కల.. ఫలించిన వేళ

- శరవేగంగా మెయిన్ రోడ్డు నిర్మాణం పనులు
- దుగ్గిరాల ప్రజలకిచ్చిన హామీ నెరవేర్చిన నారా లోకేశ్



దుగ్గిరాల శివాలయం సెంటరులో తారురోడ్డు వేస్తున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

దుగ్గిరాల(ఆంధ్రజ్యోతి), నవంబరు 11: గుంతలమయమై, వర్షపు నీరు నిలిచి, వాహనాలపై వెళ్లేందుకు వీలులేక, రోడ్డు పక్కన బురదతో నడవలేక, బస్సులు, ఆటోలు చిందే మురుగునీరు బట్టలపై పడుతుంటే మహిళలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు పడిన అవస్థలకు తెరదించుతూ, మండలకేంద్రం దుగ్గిరాలలో మెయిన్‌రోడ్డుకు నిర్మాణం పూర్తి దశకు వచ్చింది. రాష్ట్ర విద్య, ఐటీ, మానవవనరులు శాఖామంత్రి నారా లోకేశ్‌కు ఎన్నికల ప్రచారంలో దుగ్గిరాలకి వచ్చినప్పుడు స్థానికులు తాము అడుగడుగునా మెయిన్ రోడ్డు గుంతలతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరవు పెట్టారు. తాము అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే మెయిన్ రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామని నాడు చెప్పిన లోకేశ్ హామీని నిలబెట్టుకున్నారు. ఆలీగనర్ జెండాచెట్టునుంచి ఇన్‌సాన్ గ్యాస్ ఏజన్సీ వరకూ గల 1.8కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్డు కొంతమేర ఎత్తుపెంచి తారురోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతుండటంతో బస్‌స్టాండ్ వద్ద, శివాలయం ఎదుట నిలుచున్న ప్రజల కళ్లల్లో ఆనందం స్పష్టంగా కనిపించింది. మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, అభివృద్ధి అంటే ఏమిటో చేసిచూపిస్తామని చెప్పిన లోకేశ్ తన మార్కుపాలనతో ప్రజల మన్ననలు పొందుతూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అబుల్‌కలాం జయంతి



డాక్టర్ అబుల్‌కలాం అజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, ముస్లింలు

దుగ్గిరాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారత తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని జెండాచెట్టు సెంటర్‌లో భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని నేతృత్వంలో మౌలానా అబుల్‌కలాం చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు అబుల్‌కలాం, దేశంలో విద్యా సంస్కరణలకు ఆద్యుడుగా నిలిచారని, మైనార్టీల సంక్షేమానికి చేసిన సేవలు మరువలేనివని, హిందూ, ముస్లింల ఐక్యతను చాటిచెప్పిన మహనీయుడుగా పేర్కొన్నారు. డాక్టర్ పెద్దేటి యోహాను, మునిపల్లి కుమార్, బలుసుపాటి ఎల్లేశ్వరరావు, షేక్ రషీద్, అబ్దుల్, పఠాన్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి



నిడమర్రులో ప్రజాపోరు ప్రచార జాతాలో పాల్గొన్న సీపీఎం శ్రేణులు

మంగళగిరి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్న దృష్ట్యా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచడంతో పాటు వారికి వేతనాలను కూడా పెంపుదల చేయాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. మంగళగిరి మండలం నిడమర్రు, కురగల్లు, నీరుకొండ, బేతపూడి, నవులూరు, ఎర్రబాలెం గ్రామాల్లో సోమవారం సీపీఎం శ్రేణులు ప్రజాపోరు ప్రచారం నిర్వహించాయి. రవి మాట్లాడుతూ రాజధానిలో అంగన్‌వాడీలు, ఆశాలు, ఇతర స్కీం వర్కర్లకు గత ప్రభుత్వం నిలిపివేసిన సామాజిక పింఛన్లను పునరుద్ధరించాలని, నిత్యావసర ధరలను నియంత్రించాలని, రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు అవసరమైన నిత్యావసరాలను సరఫరా చేయాలని, ప్రజలపై విద్యుత్ భారాలను ఉపసంహరించాలని డిమాండ్‌చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికై ఈ నెల 14వ తేదీన తహసీల్దారు కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, కట్టెపోగు వెంకటేశ్వర్లు, గైరుబోయిన నాగేశ్వరరావు, అత్తలూరి వీరవెంకయ్య, ఎం.రాజముని, గణేష్, అంకమ్మరావు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో

అసభ్య పోస్టులపై ఫిర్యాదు

దుగ్గిరాల, నవంబరు 11: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌లపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య కరమైన పోస్టులు పెట్టిన వ్యక్తిపై దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం మాదిగుబ్బ గ్రామానికి చెందిన జింకాల రామాంజనేయులు సోమవారం ఉదయం 10 గంటల సమయంలో చంద్రబాబునాయుడు, లోకేశ్‌లపై అవమానకరమైన పోస్టులు పెట్టడం తాను చూశానని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ, మండల గ్రామం ఈమనికి చెందిన టీడీపీ నేత మన్నం అశోక్‌కుమార్ ఫిర్యాదుచేశాడు. ఈమేరకు రామాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్. వెంకటరవి తెలిపారు.



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బాలికల విద్య ప్రోత్సాహానికి

రోటరీ క్లబ్ విశేష కృషి

పెదనందిపాడు, నవంబరు 10 : బాలికల విద్యను ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ విశేష కృషి చేస్తుందని రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్, మీడియా కో ఆర్డినేటర్ పోపూరి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఐదుగురి విద్యార్థినిలకు సోమవారం సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సేవే ధ్యేయంగా రోటరీ పని చేస్తూ, అనేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని, దాతల సహకారంతో శుక్లాల ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నల్లపనేని శివప్రసాద్, సభ్యులు రమణయ్య, హెచ్ఎం లక్ష్మీదుర్గా, ఉపాధ్యాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పవన్‌కల్యాణ్, చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న అంబటి తిరుపతిరావు, కూటమి నాయకులు

సీఎం, డిప్యూటీ సీఎం

చిత్రపటాలకు క్షీరాభిషేకం

తాడేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి జనసేన పార్టీ ఇంచార్జి చిల్లపల్లి శ్రీనివాసరావును ఏపీ మెడికల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తాడేపల్లి పట్టణ జనసేనపార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అంబటి తిరుపతిరావు మాట్లాడుతూ చిల్లపల్లి శ్రీనివాసరావును ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం అభినందనీయమని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు జొన్నా రాజేష్, మండల కార్యదర్శి మానుకొండ చాముండేశ్వరిదేవి, మండేపూడి మాధవి, కాశిమాల, దినేష్, చక్రవర్తి, కిలాని మణికంఠ, చల్లా వెంకటేశ్వరరావు, వల్లెపు శివప్రసాద్, వేముల వెంకటేశ్వరరావు, దుర్గాబాయి, కొలనుకొండ శంకర్, పురంశెట్టి రమేష్, చల్లా వెంకటస్వామి, మర్రే చంద్రశేఖర్, పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్ర జ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన హామీలను నెరవేర్చాలని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ అధ్యక్షుడు ఎస్ దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించగా, నేతలు పలువురు పాల్గొన్నారు.

575 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి), నవంబరు 11: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో 575 బస్తాల పసుపును రైతులు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,100, గరిష్ఠ ధర రూ. 11,400, మోడల్ ధర రూ. 11,209 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 11,100, గరిష్ఠ ధర రూ.11,400 మోడల్ ధర రూ. 11,200 పలికాయి.

పశ్చిమడెల్టాకాల్వకు

6024 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి), నవంబరు 11: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 6024 క్యూసెక్కుల సాగు నీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 296 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1618క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 520 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 152 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 372 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 2940 క్యూసెక్కులు విడుదల చేశారు.



సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌లో టీడీపీ నేతలు

టీడీపీ సభ్యత్వ నమోదు

తాడికొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తాడికొండలోని రావిచెట్టు సెంటర్ వద్ద సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వ రరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటుందని, పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు ఎంతో అవశ్యకమని అన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ ఓటు కార్డు తీసుకొని వచ్చి పార్టీ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవచ్చునని అన్నారు. అలాగే సభ్యత్వం లేని వారి ఓటు కార్డు ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు ధనేకుల హరిబాబు, చొప్పర యాకోబు, శృంగారపాటి శేషయ్య, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, నన్నే, నీరుకొండ పెద్దబ్బాయి, ధనేకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆజాద్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న పాలకవర్గం

అబుల్‌కలాంకు ఘన నివాళి

పెదనందిపాడు, నవంబరు 11: స్థానిక లయన్స్ మాంటిస్సోరి పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన స్వాతంత్ర్య సమరంలో చేసిన కృషి, విద్యార్థులకు విద్యను ప్రోత్సహించేందుకుచేసిన కృషిని బావితరాలు గుర్తించుకుని ముందుకు సాగాలని అన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలను, గ్రామాలలో ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ షేక్ మహ్మద్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరీముల్లాలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దాసరి శేషగిరిరావు, సెక్రకటరీ అండ్ కరస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి, అధ్యక్షుడు అరవపల్లి కృష్ణ, ప్రిన్సిపాల్ కిరణ్ జోష్ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు అన్యాయం

మంగళగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడం దారుణమని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శివదుర్గారావు, పి.బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేతకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని, చేనేతను ఆదుకుంటామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ.2,16,786 కోట్ల బడ్జెట్‌లో చేనేత ఊసే లేకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయం తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న వృత్తి చేనేత అంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం, వ్యవసాయ రంగానికి రూ.11,855 కోట్లు కేటాయించి, రెండో ప్రాధాన్యతా రంగమైన చేనేతను పూర్తిగా విస్మరించడం దుర్మార్గమన్నారు. బడ్జెట్‌లో చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు జీవో విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.



ప్రత్తిపాడులో గాబులను పరిశీలిస్తున్న ఎస్‌యువో ప్రసన్నకుమార్

జ్వరాలకు కారణాలపై ఆరోగ్యశాఖ ఆరా..

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో జ్వరాల తీవ్రతకు కారణాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'విజృంభిస్తున్న విషజ్వరాలు' కథనానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. ఆరోగ్యశాఖ సబ్‌యూనిట్ ఆఫీసర్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధులలో గాబులు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, కాలువలు పరిశీలించారు. అంతేకాకుండా జ్వరాలు ఉన్నాయా లేవా అన్న విషయాలను కూడా గృహాల వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యఆరోగ్య శాఖ సిబ్బందితో మాట్లాడారు. జ్వరాల తీవ్రతపై ఆరా తీశారు. కార్యక్రమలో హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం చిన్నారి, లక్ష్మీప్రసన్న, నాగవరలక్ష్మి పాల్గొన్నారు.



ధనుర్మాస మహోత్సవాల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఆచార్యులు

16 నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవాలు

మంగళగిరి సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సకల సంపదలను ప్రసాదించే గోదావరి ఆచరించిన శ్రీకృష్ణ దీక్షా సహిత ధనుర్మాస వ్రత మహోత్సవాలను డిసెంబరు 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు మంగళగిరిలో నిర్వహిస్తున్నట్టు సీతానగరం చినజీయర్ స్వామి ఆశ్రమం ఆధ్యాత్మిక వ్యాఖ్యాత కూర్మనాథ ఆచార్యులు తెలిపారు. శ్రీశ్రీశ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని బాపూజీ విద్యాలయం ఆవరణలో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆత్మకూరు వైటీఆర్ ట్రస్టు కార్యాలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాల తాలూకా గోడప్రతులను ఆవిష్కరించారు. కూర్మనాథ ఆచార్యులు మాట్లాడుతూ భగవంతుడి అనుగ్రహం, నిజ జీవితంలో ఉన్నతిని సాధించడానికి ధనుర్మాస వ్రతం సులభమైన మార్గమన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ వ్రతాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి గోదారంగనాథుల అనుగ్రహాన్ని పొందాలని కోరారు. వైటీఆర్ ట్రస్టు చైర్మన్ యర్రాకుల తులసీరామ్ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా వుండాలని, అమరావతి రాజధాని అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వేద విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ మధుసూదనాచార్యులు, విజయకీలాద్రి ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆశ్రమ నిర్వాహకులు రఘునాథాచార్యులు, న్యాయవాది నాగార్జున బాబు, తుల్లిమిల్లి రామకృష్ణ, కొలుసు రాజా, త్రిపురమల్లు సతీశ్, బలరామ్ సేన, వికాస తరంగిణి ప్రతినిధులు రుక్మిణి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

సాగు సాయాన్ని వెంటనే అందించాలి

మంగళగిరి సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులు, కౌలు రైతులకు తక్షణమే సాగు సాయం అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఖరీఫ్ పూర్తయి రబీ ప్రారంభమై నెల రోజులు గడిచినా నేటివరకు పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళగిరిలో రైతు సంఘం నేతలు అధికారులను కలిసి రైతాంగ సమస్యలపైవినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజనులో అకాల వర్షాల వలన లక్షలాది ఎకరాల్లో పంట దెబ్బతిందన్నారు. నష్టపరిహారం నామమాత్రంగానే అందిందని, కౌలు రైతులకు అది కూడా దక్కలేదని చెప్పారు. ఖరీఫ్ నిమిత్తం తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేసి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని, ప్రకాశం, రాయలసీమ జిల్లాలను కరువు మండలాలుగా గుర్తించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించి నిర్మాణాలను చేపట్టాలని, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, రబీలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సకాలంలో అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, రైతు సంఘం నేతలు గుంటక సాంబిరెడ్డి, జవ్వాది సాంబశివరావు, జాలాది జాన్‌బాబు, తుడిమెళ్ల వెంకటయ్య, గవహర్ జానీ, వి.నాగేశ్వరరావు, పొదిలి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ నాసరయ్యకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు


రైతు సంఘం నేతల ఆందోళన

తాడికొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.వీ.వీ. ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం తాడికొండ తహసీల్దార్ కార్యాలయంల వద్ద రైతు సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టి 5 నెలలు అయిందని, రైతులకు ఇస్తానని చెప్పిన రూ.20,000 పెట్టుబడి సాయం ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పూర్తి అయిందని, వర్షాల వల్ల పంటలు సైతం దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. రబీ సీజన్ ప్రారంభం అయిన ప్రభుత్వంలో చలనం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.13,500 రైతులకు ఇచ్చిందని గుర్తుచేశారు. రైతు సమస్యలను పరిష్కరించేఉంకదుప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ నాసరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పీ.శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి శివశంకర్‌రావు, గుర్రం కొండ సత్యానందం, భాస్కరరావు,మహిళా సమైక్య నాయకురాలు తోకల అనురాధ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాడికొండ ఎంపీడీవో సమతావాణిని రైతు సంఘం నేతలు మర్యాద పూర్వకంగా సోమవారం కలిసారు. రైతు సమస్యలు, ఉపాధిహామీపనులు, గ్రామాల అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో రైతుసంఘం నేతలు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక సోమవార పూజలు



పెదనందిపాడులోని శివాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



అనంతవరప్పాడులో అలంకరించిన శివలింగం

దుగ్గిరాల, నవంబరు 11: మండంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక మాసం రెండో సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాలలోని శ్రీగంగాపార్వతీసమేత శ్రీనాగేశ్వర స్వామివారి ఆలయంలో పరమశివుడు, పార్వతీ అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర కార్తీకమాసంలో మహిళలు సాయంత్రం వరకూ ఉపవాస దీక్షనాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన శివలింగాకార లక్ష ఒత్తుల దీపోత్సవంలో భక్తులు పెద్ద యెత్తున పాల్గొన్నారు. అర్చకుడు యుగంధర్‌శర్మ కార్తీకమాస ప్రాధాన్యతను తెలియజేసే కథలను భక్తులకు చదివి వినిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

వట్టిచెరుకూరు,(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా తెల్లవారు జామునే ఆయా ప్రాంతాల్లోని కాల్వల వద్ద, చెరువుల వద్ద మహిళలు స్నానాలు ఆచరించి ప్రమిదలతో దీపారాధనలు చేశారు. ఆయా గ్రామాల పరిధిలోని శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయాలు కిక్కిరిసి పోయాయి. మండల కేంద్రం వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయం, అనంత వరప్పాడు గ్రామంలోని మల్లేశ్వర స్వామి ఆలయం, లేమల్లెపాడులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, ముట్లూరు గ్రామానికి సమీపంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శైవ క్షేత్రాలు భక్తులతో నిండి పోయాయి. భక్తుల తెల్లవారు నుంచే ఆలయాలంలో ప్రదక్షణాలు చేసి దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణాలు కార్తీకదీపాల కాంతులతో దేదీప్యమానంగా దర్శనమిచ్చాయి.

ప్రజావేదికకు 8 దరఖాస్తులు

తెనాలి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 దరఖాస్తులు అందాయని కార్యాలయ వర్గాలు తెలిపాయి. రెవెన్యూ 4, పోలీసు 1, డీఎల్‌పీవో 2, డీటీపీ 1 దరఖాస్తులు అందాయని వాటిని సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పురపాలక సంఘానికి నాలుగు అర్జీలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘంలో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కమిషనర్ శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ విభాగానానికి ఒకటి, శానిటరీ విభాగానికి ఒక అర్జీ, ఇంజనీరింగ్ శాఖకు రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో కలసి చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో 7 అర్జీలు

తెనాలి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 7 అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. వాటిలో నాలుగు అడంగల్‌కు రాగా మరో రెండు సర్వేకి, చెరువు పూడిక తీయించాలని ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి ఒకటి వచ్చినట్లు వెల్లడించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా కృషిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

వృద్ధులు, పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ

తెనాలి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సర్వదేవ పరంజ్యోతి మానవ సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులు, పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కృతజ్ఞత దినోత్సవం పురస్కరించుకుని జన్మనిచ్చిన తల్లిదండ్రులను, చదువు నేర్పిన గురువులను గౌరవించి సాటి మనుషులను ఆదరించడమే సమితి లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. బుర్రిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. మహాత్మాగాంధీ ఆశ్రమంలో వృద్ధులకు, నందులపేట నిరాశ్రయులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం

తెనాలి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెంచుపేట కేవీఎం హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ నాగభైరు హేమలతను సోమవారం సన్మానించారు. నిడుబ్రోలు హైస్కూల్‌కు ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందిన ఆమెను శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. హెచ్‌ఎం రాజారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అంబరీషుడు, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ఆచరణ సాధ్యం కాని బడ్జెట్: కాంగ్రెస్

పొన్నూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ ఆచరణ సాధ్యం కాదని కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్ సోమవారం అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో టీడీపీ, వైసీపీ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత, జగన్, బాబులకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. మోదీలాంటి నియంత దేశ ప్రధానిగా ఉండటం రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యం అన్నారు. ఆదాయమే లేని రాష్ట్రానికి రెండున్న లక్షలకోట్ల అంచనాలతో బడ్జెట్ పెట్టడం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు.

14 నుంచి 20 వరకూ గ్రంథాలయ వారోత్సవాలు

తెనాలి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 20వరకూ 57వ శాఖ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కొలకలూరు శాఖ గ్రంథాలయాధికారి కడియాల సుజాత ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్, క్రీడలు, ఇతర పోటీలు, అవగాహన ర్యాలీలు, పుస్తక ప్రదర్శన వంటివి జరుగుతాయన్నారు. చివరిరోజు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సుజాత కోరారు.

క్రైమ్ జోన్

కుమారుడి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడి ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి వస్తానంటూ వెళ్లిన కుమారుడు తిరిగి రాలేదంటూ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక ముత్తెంశెట్టిపాలెంకు చెందిన తాగుపర్తి అనిల్‌కుమార్ (39) టెంటుహౌస్ నిర్వహిస్తుంటాడు. ఇతనికి వివాహమై భార్య ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం తన స్నేహితుడి కుమారుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో అతని సెల్‌ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. అతని స్నేహితులను, తెలిసిన వారిని విచారించగా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం అతని ద్విచక్రవాహనం, చెప్పులు కపేళా వంతెన వద్ద ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. దీనితో కుమారుడి అదృశ్యంపై తండ్రి మాధవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిరుపయోగంగా సిగ్నలింగ్ వ్యవస్థ

- దాతల సహకారం నిష్ఫలం
- అలంకారప్రాయంగా సిగ్నల్స్
- సిగ్నల్ బాక్సులకు ఇనుప రాడ్లు ఊడితే తాడుతో సరి
- లక్షలు ఖర్చుచేసినా కనీస మరమ్మతులు కరువే
- సీసీ కెమెరాలు సైతం ఇదే తీరు


తాడుతో వేలాడదీసిన సిగ్నలింగ్ బాక్స్, రైల్వేస్టేషన్ రోడ్డు కూడలి సాయిబాబాగుడి వద్ద, మార్కెట్ ప్రాంతంలో పనిచేయని సిగ్నల్స్

తెనాలి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే తెనాలిలో ట్రాఫిక్ జామ్ సమస్యలకు చెక్‌పెట్టి వాహనదారులను సకాలంలో గమ్యస్థానం చేర్చేలా ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటుచేశారు. దీనికి కాంటినెంటల్ ఫ్యాక్టరీ సహకారం అందించి రూ.లక్షల ఖర్చుతో పట్టణంలోని పలు కూడళ్ల వద్ద వీటిని ఏర్పాటు చేశారు. ప్రజల్లో సిగ్నల్స్‌పై అవగాహన లేకపోవడంతో నెలపాటు గజిబిజిగా ఉన్నప్పటికి రోజులు గడుస్తున్న కొద్దీ వాహనదారులే సిగ్నల్స్‌ను అనుసరిస్తూ వెళ్లడం మొదలు పెట్టారు. ఐతే తెనాలిలో ఏది మొదలు పెట్టినా మూడునాళ్లముచ్చటే అని ప్రజల్లో ఓ భావం ఉంది. దానికి తగ్గట్టుగానే ఉన్నట్టుండి సిగ్నలింగ్ వ్యవస్థను పూర్తిగా నిలుపుదల చేశారు. దీంతో అవి అలంకారప్రాయంగా మారాయి. సిగ్నల్స్‌కు వాడిన ఫోల్‌కు అమర్చిన విద్యుత్, టైమింగ్ స్విచ్‌బాక్స్‌లు అక్కడక్కడా పోల్ రాడ్లకు వాడే బోల్ట్‌లు ఊడిపోయి వేలాడుతున్నాయి. దాతల సొమ్మేగా అనుకున్నారో ఏమో బోల్ట్‌ల స్థానంలో ఓ రబ్బరు తాడుకట్టి స్తంభానికి వేలాడదీశారు. దాతలు ఎంతో ఉదార స్వభావంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్యను తప్పించేందుకు సహకారం అందిస్తే దానిని ఇలా నిరుపయోగంగా మార్చడంపై అధికారుల తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో శాంతి భద్రతలను పటిష్ఠం చేస్తున్నామని పోలీస్ యంత్రాంగం హడావిడి చేసి పట్టణంలోని దాదాపుగా అన్ని వార్డులలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. దానిని పర్యవేక్షించేందుకు మునిసిపల్ కార్యాలయ సమీపంలో ఓ రూమ్‌ను ఏర్పాటుచేసి పట్టణంలో అనుమానితుల కదలికలపై నిఘాపెట్టి శాంతిభద్రతల పరిరక్షణకు చక్కటి ప్రణాళికతో ముందుకు వచ్చారు. ప్రతి వీధిలో కెమెరా ఉండటంతో చోరీలు, చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకునే సమయంలో కంట్రోల్ రూమ్‌లో వాటిని పసిగట్టి నిముషాల వ్యవధిలో ఆ ప్రాంతానికి పోలీసులు చేరుకుని వాటిని అరికట్టేవారు. అయితే కెమెరాల్లో చిన్నపాటి మరమ్మతులు చోటుచేసుకోవడంతో వాటిపై అధికార యంత్రాంగం పెద్దగా దృష్టిపెట్టకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. ఎండకు ఎండి, వానకు తడిచి నిరుపయోగంగా మారిపోయాయి. రూరల్ ప్రాంతంలో కూడా ఇదే పరిస్థితి కొలకలూరు గ్రామం నుంచి నందివెలుగు మీదుగా రూరల్ పోలీస్ స్టేషన్‌కు సీసీ కెమెరాలు దాతల సహకారంతో ఏర్పాటు చేయగా అవి కూడా మూనాళ్లముచ్చటగా మిగిలాయి. ఇటువంటి సంఘటనలు చూసిన ప్రజలు ప్రస్తుతం ట్రాఫిక్ సిగ్నల్స్ దుస్థితిని చూసి చివరికి ఇవి కూడా కాలగర్భంలో కలిసిపోతాయని వాపోతున్నారు.

ఇప్పటికైనా ట్రాఫిక్ సిగ్రల్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి వాటి నిర్వహణలో పాలను అధిగమించి ప్రజల్లో దాతల చేయూతను సద్వినియోగం చేస్తున్నామన్న భరోసాను నింపాలని పలువురు కోరుతున్నారు.


సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయకపోవటంతో ఇష్టానుసారం వెళుతున్న వాహనాలతో నిలిచిపోయిన ట్రాఫిక్, ప్రధాన రహదారుల్లో పనిచేయని సీసీ కెమెరాలు

పదిలో ఫలితాల సాధనకు ప్రణాళిక

● డీవైఈవో శాంతకుమారి

ఫటా ఫట్



తెనాలి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో తగిన ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటినుంచే ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని డీవైఈవో జి.శాంతకుమారి చెప్పారు. తెనాలి ఉప జిల్లా విద్యాశాఖ పరిధిలో పాఠశాలల పనితీరుపై ఆంధ్రజ్యోతితో వెల్లడించిన వివరాలు.

ప్రశ్న: పదో తరగతి ఫలితాల సాధనకు ప్రణాళిక ఉందా?

జవాబు: డివిజన్‌లో గత ఏడాది కన్నా ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణతను మెరుగుపరుస్తాం. ఇందుకోసం ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. ప్రధాన ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అదనపు సమయం బోధన చేయాలి.

ప్రశ్న: విద్యామిత్ర కిట్‌లో బూట్లు, టై ధరించడం లేదు?

జ: ప్రభుత్వం ఇచ్చిన విద్యామిత్ర కిట్‌లో బూట్లు, టై ధరించేలా చర్యలు తీసుకుంటాం. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజు పర్యవేక్షించి విద్యార్థులను గైడ్ చేసి అవి ధరించేలా చూస్తాం.

ప్రశ్న: గైర్హాజరు శాతం తగ్గడానికి ఏం చేస్తున్నారు?

జ: ప్రభుత్వ పాఠశాలలో ప్రతిరోజు విద్యార్థుల గైర్హాజరుపై సమీక్షిస్తున్నాం. ప్రతి పాఠశాలలో తరగతి ఇన్‌చార్జ్‌లను ఈ అంశంపై దృష్టి పెట్టాలని హెచ్ఎంలను ఆదేశిస్తాం. గైర్హాజరు శాతం తగ్గిస్తాం.

ప్రశ్న: ప్రైవేట్ స్కూల్స్ సరైన అజమాయిషీ లేదు?

జ: డివిజన్‌లో ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేయాలి. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ మా దృష్టికి ఎలాంటి ఫిర్యాదు రాలేదు.

సమస్య ఇది.. స్పందించరూ

అలంకారప్రాయంగా వాటర్ ఫౌంటెయిన్



దశాబ్దం క్రితం ప్రజలకు ఆహ్లాదం కోసం చినరావూరు పార్కు వద్ద చిన్న వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం పనిచేయక శిథిలావస్థకు చేరింది.
- తెనాలి క్రైం

భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన కల్యాణోత్సవాలు


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

పొన్నూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా సుప్రభాత సేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కల్యాణ క్రతువును అర్చక స్వాములు వేద మంత్రాల సాక్షిగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను భక్తులు తిలకించారు.

ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించేలా ప్రచారం చేస్తున్న వ్యక్తిపై అంగలకుదురుకు చెందిన నలుకుర్తి సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం సోషల్ మీడియాలో హరశివశం కర్‌రెడ్డి పెసర్లంక అనే ఐడీ నుంచి ప్రభుత్వాన్ని కించపరుస్తూ అసభ్యకరంగా పోస్ట్‌పెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజలను తప్పుదారి పట్టించేలా ప్రచారం చేస్తున్నాడని అంగలకుదురుకు చెందిన సునీల్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు


కొల్లిపర శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కొల్లిపర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లవారు జామున కృష్ణానదిలో స్నానాలు చేసి పసుపుతో వినాయకుడిని చేసి దీపారాధన చేసి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణా నది సమీపంలో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. ఉదయం 6 గంటలలోపే మహిళలు శివాలయాలకు చేరకుని 365 ఒత్తులను వెలిగించారు. మండల కేంద్రం కొల్లిపర గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా జనార్థనస్వామి దేవస్థానంలో, శ్రీ షిర్డిసాయిబాబా మందిరంలో పండితులు నాగరాజుశర్మ, వెంకటేశ్వరశర్మ, కుమారస్వామి, జగన్నాథాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. పార్వతీ పరమేశ్వర్లకు పూజలు చేయడం వలన భక్తులకు కోరిన కోర్కెలు తీరుతాయని వేద పండితులు వివరించారు.

బాలాజీరావుపేటలో లక్ష ఒత్తుల దీపోత్సవం

తెనాలి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీరావుపేట దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష ఒత్తుల దీపోత్సవం నిర్వహించారు. శివలింగాకృతిలో దీపాలు వెలిగించి సోమవారం పూజలు చేశారు. ఆలయ కమిటీ ధర్మకర్త వెంకటేశ్వరరావు, అర్చకులు బాబీ, జగదీష్ పర్యవేక్షించారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం సోమవారాన్ని పురస్కరించుకుని శైవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శైవాలయాల్లో వేకువ జాము నుంచి మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సహస్రలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు జరిగాయి. ఆలయంలో కొలువుతీరిన 1008 శివ లింగాలకు అభిషేకాలు నిర్వహించి దీపోత్సవం జరిపారు. అలాగే కాశీ విశ్వేర స్వామి, పాతపొన్నూరులోని బాలకోటేశ్వర, స్వామి, చింతలపూడిలోని మల్లేశ్వరస్వామి, వల్లభరావుపాలెంలో ఓంకారేశ్వర స్వామి, ములుకుదురులోని రామలింగేశ్వర స్వామి, మామిళ్లపల్లిలోని అగస్త్రీశ్వర స్వామి, చేబ్రోలులోని నాగేశ్వరస్వామి, భ్రమరలింగేశ్వర స్వామి తదితర ఆలయాలో కార్తీక దీపోత్సవాలు జరిగాయి. మహిళలు వేకువ జామునే ఆలయాలకు విచ్చేసి దీపారాధనలు చేసి ఉపవాస దీక్షలను ఆచరించారు. సాయంత్రం దీపారాధనలు చేసి పూజల అనంతరం ఉపవాస దీక్షలు విరమించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


లక్ష ఒత్తులతో శివలింగాకృతిలో దీపారాధన, ప్రత్యేక అలంకారంలో సహస్రలింగేశ్వర స్వామి


మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

అబుల్ కలామ్ ఆజాద్ సేవలు మరువలేనివి: మాదాల

పొన్నూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడిగా విద్యాశాఖ మంత్రిగా డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చేసిన సేవలు మరువలేనివని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంతత సమరయోధుడిగా దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, బహుబాషా కోవిదుడిగా ఆజాద్ చేసిన సేవలను మననం చేసుకున్నారు. ఆజాద్‌ను స్మరించుకునేందుకు ప్రభుత్వం నవంబరు 11వ తేదీన జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, షేక్ బాజీసాహెబ్, మహ్మద్ గౌస్, కరిముల్లా బాజీ, యరసాని శ్రీరామూర్తి, సిలార్ బాషా, బాలకృష్ణ రెడ్డి, షేక్ మొగల్ బేగ్, జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బీజేపీ నాయకులు గురుబాలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కరాటే పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులు

కరాటే పోటీల్లో సెయింట్ థామస్ విద్యార్థుల ప్రతిభ

పొన్నూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన కరాటే పోటీలో ప్రతిభ చూపారు. ఇటీవల మంగళగిరిలో జరిగిన 9వ జాతీయ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన షేక్ రైయాన్, గుమ్మడి జాహ్నవి, కొలకని తన్వీష్, టీం కటా పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించారు. సింగిల్ కటాలో షేక్ రైయాన్, ఒక బంగారు పతకం, జాహ్నవి, తన్వీష్‌లు కాంస్య పతకాలు సాధించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్ రోజ్ థామస్ కోచ్ ఉమామహేశ్వరరావు తదితరులు అభినందించారు.

కొలకలూరులో తాగునీటి కనెక్షన్‌కు డబ్బుల డిమాండ్‌పై ఫిర్యాదు

● విచారణ చేపట్టిన తహసీల్దార్ గోపాలకృష్ణ


కొలకలూరు కాలనీలో పైప్‌లైన్ సమస్యను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గృహాలకు తాగునీటి కనెక్షన్ ఇచ్చేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కొలకలూరు ఎస్సీ కాలనీ వాసులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు సోమవారం సాయంత్రం గ్రామంలో తహసీల్దార్ గోపాలకృష్ణ పర్యటించి వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తమ కాలనీలో సుమారు 300వరకూ వాటర్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఐతే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒక్కో కనెక్షన్‌కు రూ.1000 వంతున కట్టాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. రోజువారి కూలి పనులు చేసుకునే కాలనీ వాసులు అంతంత మొత్తంలో చెల్లించలేమన్నారు. అధికారుల ఒత్తిడి పెరగడంతో ఫిర్యాదుచేయడం జరిగిందన్నారు. తమ ప్రాంతంలో వాటర్‌లైన్ సైతం మురుగుకాలువలో ఉందని వాటికి లీకులు ఏర్పడటంతో తాగునీటితోపాటు కాలువలో నీరుచేరి కలుషితమైన నీరు వస్తున్నాయని వాపోయారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ కాలనీలో ప్రజల లెవ్వరూ ఒక్క రూపాయి కూడా కట్టనవసరం లేదన్నారు. కలుషితమైన నీటి సమస్యపై ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు. డిపార్ట్‌మెంట్ వారు డబ్బులు డిమాండ్ చేశారని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు. పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలు ఐకమత్యంగా ఉండాలి: మోసిగంటి

పొన్నూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలు ఐకమత్యంగా ఉండి ఒకరికొకరు సహకారం అందించుకోవాలని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ జోసఫ్ పి.మోసిగంటి అన్నారు. సోమవారం మైనార్టీ వెల్ఫేర్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో ఉన్న మైనార్టీలు ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, సిక్, జైన్ వర్గాలకు సమానంగా సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాలను కోరారు. మత విశ్వాసాలను ఆచరించటం సంస్కృతులను కాపాడటంలో ప్రభుత్వాలు జాగ్రత్తలు పాటించాలన్నారు. వైస్ జగన్ హయాంలో తనకు క్రైస్తవ ముద్ర పడకూడదని క్రైస్తవులను దూరం పెట్టి క్రైస్తవులను మైనార్టీలుగా గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చంద్రబాబుకు క్రిస్టియన్ మైనార్టీలు అండగా నిలిచారన్నారు. మత ఛాందసవాదులను అరికట్టి చర్చిలపై దాడులు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని జోసఫ్ కోరారు.


సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు మృత్యుంజయరావు

మృత్యుంజయరావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

కొల్లిపర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మృత్యుంజయరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చేతులు మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. మృత్యుంజయరావుకు అవార్డు రావటంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు.